విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శనివారం 21 జూన్ 2025   8 పేజీలు

కోకో రైతుల నుంచి ప్రతి గింజ కొనుగోలు

- వినతుల స్వీకరణకు కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేక సెల్ 7995367797
- 1140 మంది కోకో రైతుల నుంచి అదనంగా మరో 331 మెట్రిక్ టన్నులు కొనుగోలుకు ఆదేశాలు
- కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి / కొవ్వూరు : జిల్లాలో 546 మంది రైతుల నుంచి 250 .17 టన్నుల కోకో గింజల సేకరణ కోసం చేయడం జరిగిందనీ జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా

▶మిగతా 2లో..

అదాని.. అంబాని.. సేవలో మోదీ

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర-కామవరపుకోట: అదాని.. అంబాని.. సేవలో ప్రధాని నరేంద్రమోదీ తరిస్తున్నారని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య విమర్శించారు.సీపీఐ కామవరపుకోట మండల 11వ మహాసభ శుక్రవారం జరిగింది. ఈ మహాసభకు గుద్దేటి సత్యనారాయణ, మీసుగుల దుర్గారావు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. తొలుత తాలూకా బంగ్లా నుండి గ్రోమోర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. సీపీఐ జెండాను సీనియర్ కార్యకర్త అడపా సత్య నారాయణ ఆవిష్కరించారు. సీపీఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు గత మహాసభ నుండి ఈ మహాసభ వరకు మరణించిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, టెర్రరిస్టుల దాడిలో మరణించిన పౌరులకు, విమాన ప్రమా దంలో మరణించిన ప్రయాణికులకు, ఆపరేషన్ పేరుతో చంపివేయబడ్డ మావోయిస్టులు, అమాయకపు గిరిజనులకు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టగా మహాసభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. అనంతరం కార్యకలాపాల నివేదికను టీవీఎస్ రాజు మహాసభ ముందుంచారు. ఈ మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణ చైతన్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసగించాయని విమర్శించారు.

అధికారంలోకి రావడం కోసం బూటకపు వాగ్దానాలు చేసి కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాయన్నారు. 11 సంవత్సరాల మోడీ పాలనలో అంబాని, అదాని వంటి వారికి తప్ప పేద ప్రజలకు ▶మిగతా 2లో..

పని గంటల పెంపు ఉపసంహరించుకోవాలి

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు
కోనాల భీమారావు

విశాలాంధ్ర-తణుకు: రాష్ట్ర మంత్రి వర్గం కార్మికుల పనిగంటలు ఎనిమిది నుంచి పది గంటలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయం తక్షణం ఉపసంహరించుకోవాలని, కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని అమలుచేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు,సిఐటియు జిల్లా కార్యదర్శి పి.వి.ప్రతాప్ డిమాండ్ చేశారు. పనిగంటల పెంపు రాత్రి సమయాల్లో మహిళలు పనిచేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ కార్మిక సంఘాల రాష్ట్ర వ్యాపిత పిలుపు మేరకు శుక్రవారం సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో తణుకు నరేంద్ర సెంటర్లో నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా భీమారావు, ప్రతాప్ మాట్లాడుతూ కేవలం కార్మికులను కట్టు బానిసలను చేస్తూ సంపన్న బడా పెట్టుబడిదారులకు, కార్పోరేట్లకు ఊడిగం చేస్తూ కార్మిక హక్కులను కాలరాస్తున్నారన్నారు. పదిగంటలు పని చేయాలనడం, రాత్రి సమయాల్లో మహిళలు విధులు నిర్వర్తించాలనడం అత్యంత ▶మిగతా 2లో..

జాతీయ రహదారుల నిర్మాణంపై సమీక్ష

అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా భూసేకరణ, తదితర సమస్యలను అధిగమించి త్వరితగతిన రహదారుల నిర్మాణం జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశించారు. శుక్రవారం పలు జాతీయ రహదారుల నిర్మాణం, భూసేకరణకు సంబంధించి సంబంధిత అధికారులతో కలెక్టర్ వెట్రిసెల్వి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టిసీమ-జీలుగుమిల్లి 365 బి.బి. 40 కి.మీ. రహదారికి సంబంధించి త్వరగా భూసేకరణ చేసి నిర్మాణదారులకు స్వాధీనం చేయాలని ఆదేశించారు. మిగిలిన రైతులను సమన్వయంచేసి భూమి సేకరించి

సకాలంలో నష్టపరిహారం అందించి రహదారి నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఇందుకు సంబంధించి పోలవరం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి తహశీల్దార్లను ఆదేశించారు. ఖమ్మం, దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారికి సంబంధించి ఆయా అంశాలపై ▶మిగతా 2లో..

నేడే యోగా దినోత్సవం

కలెక్టర్ షణ్మోహన్ సగిలి

విశాలాంధ్ర - కాకినాడ : 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం మెగా యోగాడే సందర్భంగా శనివారం కాకినాడ పట్టణం నూకాలమ్మగుడి నుంచి మూడు లైట్లు జంక్షన్ మీదుగా దేవాదాయ శాఖ కార్యాలయం వరకు 3 వేల మందితో ఉదయం 6.30 గంటల నుండి 8.00 గంటల వరకు పెద్దఎత్తున యోగా నిర్వహించ నున్నట్టు కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెగా యోగ డే నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జూన్ 20 శుక్రవారం రాత్రి 8.00 గంటల నుండి 21వ తేదీ ఉదయం 9.00 గంటల వరకు ఈ రోడ్డులో ట్రాఫిక్‌ను నిలుపుదల చేయడం ప్రత్యామ్నాయ రోడ్లలో వాహనాలను మళ్లించడం పై జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులకు, దుకాణాల యజమానులకు ముందుగానే సమాచారం అందించామని, సాధారణ ప్రజలు ఇబ్బందులు పడకుండా ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలని పోలీస్ శాఖను ▶మిగతా 2లో..

కూటమి ప్రభుత్వంలో ప్రజలు అసంతృప్తి

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు

విశాలాంధ్ర - పిఠాపురం : గడచిన ఏడాది కాలంలో పిఠాపురం నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని, పవన్ కల్యాణ్‌ను గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుందని ఆశపడ్డ నియోజకవర్గ ప్రజలందరూ చాలా అసంతృప్తితో ఉన్నారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు విమర్శించారు. పిఠాపురంలో జరిగిన సీపీఐ నియోజకవర్గ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలోని సభాసదన్లో సీపీఐ పిఠాపురం నియోజకవర్గ కార్యదర్శి కేశవరపు అప్పలరాజు అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ 16వ మహాసభలో పార్టీ జెండాను తాటిపాక మధు ఆవిష్కరించారు. సీపీఐ మృతవీరులకు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం సభలో నాయకులు ప్రసంగించారు. ఈ సందర్భంగా తాటిపాక మధు మీడియాతో మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి సాకా రామకృష్ణ, కాకినాడ జిల్లా కార్యదర్శి కె. బోడకొండ, జిల్లా కార్యవర్గ సభ్యులు పి. సత్యనారాయణ, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. భవాని, అరుణ, రెడ్డి గోవిందు, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్న కార్ల(టాక్సీ) శాఖ కార్యదర్శిగా శ్రీనివాస్ ఎన్నిక

విశాలాంధ్ర- ఉండి : పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని సీపీఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు డిమాండ్ చేశారు. పెరుగుతున్న

ధరలు టాక్సీవాలాకు పెను భారంగా మారుతున్నా యని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో చిన్న కార్లు (టాక్సీవాలా) యూనియన్ శాఖ సమావేశం జిల్లా సమితి సభ్యులు సనపల శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ శాఖ సమావేశంలో శాఖ కార్యదర్శిగా నేదేటి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా కర్ణం సూరిబాబు, అంగర ఆంజ నేయులు, కె. సుబ్బారావు, ఎర్ర సురేష్, ఎం.రాజు నియమితు లయ్యారు. ఈ సందర్భంగా కలిశెట్టి వెంకట్రావు మాట్లాడుతూ టాక్సీవాలా పరిస్థితి దినదిన గండం నూరేళ్ళ ఆయుషుగా ఉందన్నారు. పెరిగిన డీజిల్ ధరలతో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కిరాయిలు లేక పూట గడవక నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. మరో పక్క గోరుచుట్టు పై రోకలి పోటు చందంగా బ్రేక్ ఇన్స్పెక్టర్లు అడుగడుగునా జరిమానాల రూపంలో చలానాలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై టాక్సీవాలా తిరగాలంటేనే భయభ్రాంతులకు గురి అవుతున్నారని పేర్కొన్నారు. జరిమానాలు విధించకుండా టాక్సీవాలాకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా సమితి సభ్యులు సనపల శ్రీను మాట్లాడుతూ చిన్న కార్ల యజ మానులు కిరాయిలు లేక చలానాలు కట్టుకోలేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభు త్వాలు టాక్సీవాలాకు ఏదైనా ప్రత్యామ్నాయం చూపించాలని తెలిపారు. ఈ సమావేశంలో పలువురు సీపీఐ సానుభూతి పరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలు

విశాలాంధ్ర - గణపవరం:



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతుల కోసం పండ్ల మొక్కలు ఉచితంగా అందజేస్తుందని గణపవరం గ్రామ సర్పంచ్ మారా అలంకారం అన్నారు. ఆసక్తి ఉన్న రైతులకు పండ్ల మొక్కలు ఉచితంగా ఇస్తామని ఆమె చెప్పారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సచివాలయం1 లో గ్రామసభ నిర్వహించారు. పొలం ఉండి పండ్లతోటలు వేసుకునే ఆసక్తి ఉన్న రైతులకు పండ్ల మొక్కలు ఉచితంగా అందిస్తామని ఉపాధి హామీ పనుల్లో భాగంగా వారికి మొక్కలు నాటే కార్యక్రమం కూడా ఉచితంగానే చేస్తామని అన్నారు. రైతులు కేవలం రవాణా సౌకర్యం చూసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు తోట శ్రీను, తెలుగు దేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్ర కుమార్ రాజు, జనసేన, తెలుగుదేశం, బిజెపి నాయకులు సెల్ పాయింట్ ప్రసాదు, వీరంకి శీను, గంటా అన్నవరం, సప్ప రాంబాబు, వేగేశ్న గనిరాజు, యలగలేటి సుబ్రహ్మణ్యం, సచివాలయ సెక్రెటరీ భాస్కరరావు ఫీల్డ్ అసిస్టెంట్ తాతయ్య, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

యోగ దినోత్సవం

(1వపేజీ తరువాయి)

జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనడానికి 10లక్షల 88 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా తొమ్మిది లక్షల 70 వేల మంది వరకు సర్టిఫికెట్లు జారీ చేసినట్టు ఆయన తెలిపారు యోగా ఆంధ్ర కార్యక్రమం 6,225 మంది యోగ టీచర్లతో సక్రమంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు సులభంగా చేయగల యోగా ఆసనాలు, శ్వాస పద్ధతులను నేర్పిస్తారన్నారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది అందరూ పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

నిర్మాణంపై సమీక్ష

(1వపేజీ తరువాయి)

అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. తాడిపూడి లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి రైతులకు నష్టపరిహారం త్వరితగతిన అందించేందుకు చర్యలు తీసుకోవాలని కొవ్వూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను కలెక్టర్ ఆదేశించారు.

కొయ్యలగూడెం పరిధిలోని రైతులకు పరిహారం చెల్లించి రోడ్డునిర్మాణానికి అవసరమైన భూమిని నిర్మాణదారులకు అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని రాజమండ్రి ఎన్.హెచ్. ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను ఆదేశించారు. పామర్రు,ఆకివీడు 165 జాతీయ రహదారికి సంబంధించి గోనేపాడు వద్ద ఆర్వోబి నిర్మాణానికి అవసరమైన భూమి విషయంలో రైతులతో సమన్వయం చేసుకుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏలూరు ఆర్డీఓ, కైకలూరు తహశీల్దారును ఆదేశించారు.

సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, డీఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, ఏలూరు ఆర్డీఓ అచ్యుత అంబరీష్, ఎన్.హెచ్ అధికారులు పలువురు తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉపసంహరించుకోవాలి

(1వపేజీ తరువాయి)

దుర్మార్గమన్నారు. ఈ దుర్మార్గపు విధానాలకు పూనుకున్న కూటమి ప్రభుత్వాలు మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

కేంద్రంలో నరేంద్ర మోడీ 44 కార్మిక చట్టాలు రద్దు చేసి కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్‌లు తేగా రాష్ట్రంలో చంద్రబాబు పని గంటలు పెంచుతూ, మహిళలు అర్ధరాత్రులు పనులు చేయాలంటూ కార్మికులకు తీరని ద్రోహం తలపెడుతున్నారన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలు నిరసిస్తూ జూలై 9 న దేశవ్యాపిత సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నామన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు వీడకపోతే కూటమి ప్రభుత్వాలకు కార్మికులు తగిన గుణపాఠం చెపుతారని హెచ్చరించారు. ఏఐటీయూసీ, సిఐటియు నాయకులు బొద్దాని నాగరాజు, ఎ. అజయకుమారి, గార రంగారావు, మందుల ముత్యయ్య, కొంబత్తుల రవికుమార్,వల్లూరి వెంకటేశ్వరరావు, హర్షవర్ధన్, బ్రహ్మాజీ, త్రిమూర్తులు,గిద్దా అన్నపూర్ణ, మార్లపూడి బర్ల, బోడపాటి నారాయణ,అయ్యప్ప, నాగేంద్రకుమార్, కనకదుర్గ, కేత శ్రీను, గోవిందరాజు, రాణి, అనంతలక్ష్మి, మందులియ్య, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు

(1వపేజీ తరువాయి)

కలెక్టర్ పి. ప్రశాంతి వివరాలు తెలియచేస్తూ, తూర్పు గోదావరి జిల్లాలో కోకో పండించే రైతుల వద్ద ఉన్న ప్రతి గింజ కొనుగోలు చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జిల్లాలో కొనుగోళ్లు చేపడుతున్నామన్నారు. జిల్లాలో తహసీల్దార్, హార్టికల్చర్ ఇతర అధికారులు, సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు క్షేత్ర స్థాయిలో పర్యటించి కోకో రైతులు పండించిన పంటల వివరాలు సేకరించనున్నట్టు తెలిపారు. క్షేత్ర స్థాయిలో 1,140 మంది రైతుల వద్ద 331 మెట్రిక్ టన్నులు కోకో పంటలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు.

ఈ అదనపు మొత్తంతో కలిపి జిల్లా వ్యాప్తంగా 1500 మంది రైతుల ద్వారా 531 మెట్రిక్ టన్నులు కోకో దిగుబడి సాధించినట్టు పేర్కొన్నారు. ఈ మొత్తంలో ఇప్పటి వరకు 546 మంది రైతుల నుంచి 250.17 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్టు తెలిపారు. కోకో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడడం కోసం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో హార్టికల్చర్ అధికారి ఆధ్వర్యంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామన్నారు. వాస్తవ సాగు దారుల నుంచి కోకో దిగుబడులను రైతుల నుంచి ఈ నెలాఖరు లోపు పూర్తిగా సేకరించనున్నట్లు కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. కోకో కంపెనీలు కిలో రూ.450 కి కొనుగోలు చేయడం జరుగుతుందని, వాటికి అదనంగా కిలో కు రూ.50 లు కంపెనీకి చెల్లింపులు చేస్తున్నా మన్నారు .

తద్వారా కిలో ఒక్కంటికి రూ.500 లు చొప్పున రైతుకు కంపెనీ ద్వారా చెల్లింపులు చేస్తున్నట్లు తెలిపారు. మిగిలిన సరుకును జూన్ 30 వ తేదీలోగా సేకరించాలని అధికారులకి లక్ష్యం నిర్దేశించి నట్లు కలెక్టర్ తెలిపారు.

వినతుల స్వీకరణ కోసం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేక సెల్ 7995367797 ను అందుబాటులో ఉంచామన్నారు.

ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు వినతులు నేరుగా లేదా ఫోన్ ద్వారా తెలియ చెయ్యవచ్చునని పేర్కొన్నారు.

సేవలో మోది

(1వపేజీ తరువాయి)

ఒరిగిందేమీ లేదన్నారు. రూ.లక్షల కోట్లను బడా బాబులకు రుణమాఫీ చేసిన ఘనత బిజెపికి చెందుతుందన్నారు.

ఆపరేషన్ కగార్ పేరిట దేశంలో ఉన్న విప్లవకారులను మట్టు పెట్టడానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రపంచవ్యాప్తంగా కార్మికులకు, కర్షకులకు అండగా నిలబడే పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని చైతన్య పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.ఎన్నికల ముందు చంద్రబాబు,పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీల ప్రకారం ఇల్లు కట్టుకునే నిరుపేదలకు రూ.5లక్షలు అందజేయాలని డిమాండ్ చేశారు.

అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.ఎన్ సాగర్ మాట్లాడుతూ ప్రజల్లో చైతన్య భావాలను నింపేందుకు ప్రజానాట్యమండలి,అభ్యుదయ రచయితల సంఘం నాటి నుండి నేటి వరకు కూడా కృషి చేస్తుందన్నారు.

కార్యక్రమంలో వందలాదిమంది వ్యవసాయ, ఏఐటియుసి, సిపిఐ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు జంగారెడ్డిగూడెం మండల సిపిఐ కార్యదర్శి జెవి రమణ రాజు, ద్వారకాతిరుమల మండల సీపీఐ కార్యదర్శి గోలివే బాలయేసు తదితరులు మాట్లాడారు.

వర్షాల జాడ లేక రైతుల్లో నిరాశ

విశాలాంధ్ర-లింగపాలెం: కొన్ని రోజులుగా మెట్ట ప్రాంతంలో అధిక ఉష్ణోగ్రతలు ఉండటంతో రైతులు,ప్రజలు నిరాశ చెందుతున్నారు.అధిక ఉష్ణోగ్రతతో పాటు వడగాలులు వీస్తున్నాయి. లింగపాలెం మండలంలో మరింత అధికంగా ఉష్ణోగ్రతలు ఉన్నాయి. జూన్ చివరి వారం వచ్చిన ప్పటికీ వాన జాడలేదు. ఈనెలలో118మీ.మీ వర్షం పడాల్సి ఉండగా ఇప్పటికీ కేవలం 11,15,17తేదీలలో 32.8మీ.మీ మాత్రమే వర్షం పడింది. వర్షం పడకపోవడంతో నారులు పోయడానికి అనుకూల మైన పరిస్థితులు కనిపించడం లేదని రైతులు ఆందోళనతో ఉన్నారు. మే నెలలో 62మీ.మీ వర్షం పడాల్సి ఉండగా 141మీ. మీ వర్షం పడింది. మేలో పడిన వర్షాన్ని రైతులు అనుకూలంగా తీసుకోరు. జూన్‌లో పడే వర్షం మాత్రమే రైతులకు ఉపయోగంగా ఉంటుంది. వర్షాలు పడకపోవ టం ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటం వడగాలులు వేయడంతో పాఠశాల లకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆశాజనక వాతావరణ పరిస్థితులు కోసం రైతులు,ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

మానవత్వం చాటుకున్న ఓం ప్రకాష్

విశాలాంధ్ర- ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమలలో ఇటీవల యాదవకళ్యాణ మండపం వద్ద జరిగిన బైక్ యాక్సిడెంట్ లో ద్వారకాతిరుమల గ్రామ నివాసితుడు, తెలుగుదేశం పార్టీ కార్యకర్త బలభద్ర బాల బాలాజీ శ్రీనివాస్, అకాల మరణాన్ని చింతిస్తూ వారి కుటుంబాన్ని పరామర్శించారు

ద్వారకాతిరుమల తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మొగతడకల ఓంప్రకాష్ అపుడు వారి పిల్లల భవిష్య త్తుకు చదువుకు అవసరమైన బాధ్యతలను తీసుకుంటానని చెప్పి వారి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మాట ప్రకారం వారి ఇద్దరు కుమారులను శ్రీ శ్రీనివాస మోడరన్ స్కూల్ లో పెద్ద కుమారుడు బలభద్ర సాయి మనోజ్‌కు 10వ తరగతి, రెండవ కుమారుడు బలభద్ర శివ నాగ ప్రవీణ్‌కు 8వ తరగతి కి సంబంధించి వారి స్కూల్ ఫీజు 68,000రూపాయలను ఆ స్కూల్ ప్రిన్సిపాల్ దావులూరి ప్రభాకర్‌కు చెక్కు రూపేణ అందించారు. ఈ కార్యక్రమంలో పాకనాటి శేషుబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవలో రెవెన్యూ శాఖ

విశాలాంధ్ర- ఉండి : రెవెన్యూ శాఖ ప్రతిక్షణం ప్రజా సేవలోనే నిమగ్నమై ఉంటుందని స్థానిక తహసీల్దార్ కావడి నాగార్జున వెల్లడించారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ డే కార్యక్రమం వీఆర్వోల సంఘ అధ్యక్షుడు చిన్నారావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ

సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ఎప్పుడు ప్రజాసేవలోనే నిమగ్నమై ఉంటుందని తెలిపారు. రెవెన్యూ సిబ్బందికి పని ఒత్తిడి బాగా పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేలు, రీ సర్వేలు సరిహద్దులు అంటూ క్షణం తీరిక లేకుండా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులతో కూడా గడప లేని స్థితి నెలకొందని పేర్కొన్నారు. ప్రభుత్వం రెవెన్యూ సిబ్బందికి పని భారం తగ్గించే విధంగా తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేవు కార్తీక్, మండల సర్వేయర్ రత్నమాల, గ్రామ రెవెన్యూ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

యోగ సాధనతో విద్యార్థుల్లో క్రమశిక్షణ

విశాలాంధ్ర-కాళ్ల : యోగ సాధనతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, మంచి ఆలోచనలు పెరుగుతాయని భీమవరం ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. జగపతి రాజు అన్నారు.

కళాశాల ఉన్నత భారత అభియాన్(యుబి ఏ), పీపుల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇన్నర్ ఇంజనీరింగ్(పిఏఐఈ) ఆధ్వర్యంలో పెద అమిరం గ్రామం లోని మోడల్ ప్రైమరీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగ సాధన, మంచి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవటం వంటి అంశాలపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి. ప్రసన్న భారతి, ఎస్ ఆర్ కే యు బి ఏ కోఆర్డినేటర్ డాక్టర్ మెహర్ గణేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో యోగ సాధన పట్ల మంచి ఆసక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ ఆర్ కే ఆర్ యు బి ఎ కోఆర్డినేటర్ డాక్టర్ టి. రాంబాబు, యోగ ట్రైనర్ పి.రమేష్ రాజు, డాక్టర్ ఆర్.సుబ్బారావు, డాక్టర్ రఘురాం, డాక్టర్ జీవన్ కుమార్, వనజ గ్లోరీ ప్రసన్న రంగ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లింగపాలెం ప్రధాన బస్టాండులో బస్సులు ఆపేందుకు చర్యలు

ఏలూరు డిపో ఆర్టీసీ డిఎం వెల్లడి

విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర-లింగపాలెం: మండల కేంద్రమైన లింగపాలెంలోని ప్రధాన బస్టాండ్ వద్ద బస్సులు నిలిపేలా చర్యలు తీసుకుంటామని ఏలూరు ఆర్టీసీ డిఎం వాణి తెలిపారు. మండల కేంద్రమైన లింగపాలెంలోని ప్రధాన బస్టాండులో బస్సులు ఆపడం లేదని, దీనివల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారంటూ విశాలాంధ్రలో ప్రచురించిన కథనంపై ఏలూరు ఆర్టీసీ డిఎం స్పందించారు. ప్రధాన బస్టాండులో బస్సులను నిలిపేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈబస్టాండులో బస్సులను ఆపకపోతే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.దీనికి సంబంధించి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామని వివరించారు.

ఇక్కడ బస్సులను ఆపకపోతే 9959225487 ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఆర్టీసీ బస్సుల వల్ల ఏ ప్రయాణికుడు ఇబ్బంది పడకూడదనేదే తమ కర్తవ్యమని వివరించారు. లింగపాలెంలో నిర్మించిన బస్టాండు నిరుపయోగంగా ఉండటంతో దీన్ని ఉపయోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని డి.ఎం తెలిపారు.

నాగిడి పాండురంగారావు కుటుంబాన్ని పరామర్శించిన సీపీఐ నాయకులు

విశాలాంధ్ర -భీమవరం: ఇటీవల మృతి చెందిన నాగిడిపాలెం సీపీఐ నాయకుడు నాగిడి పాండురంగారావు కుటుంబాన్ని సీపీఐ మండల కమిటీ నాయకులు పరామర్శించారు. పరామర్శించిన వారిలో సీపీఐ రూరల్ మండల కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్, జిల్లా సమితి సభ్యులు నాగిడి తులసిరావు ,తిరుమాని కామేశ్వరరావు, నాగిడి పాలెం శాఖ కార్యదర్శి నాగిడి నాగరాజు ఉన్నారు. ఈ సందర్భంగా సీతారాం ప్రసాద్ మాట్లాడుతూ పాండురంగారావు పార్టీ పట్ల ఎంతో విధేయతతో, నిబద్ధతతో, అంకితభావంతో పని చేశారని గుర్తు చేశారు. పార్టీ ఇచ్చిన అన్ని కార్యక్రమాల్లో పాల్గొనేవారని, తీరప్రాంత సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు నాగిడి సాంబమూర్తి నడిపిన ఉద్యమాలు, సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారని కొనియాడారు. ఇటీవల పేదలకు ఇళ్ల స్థలాలకై సీపీఐ దరఖాస్తులు చేయించిన సందర్భంలోనూ ఆయన పాల్గొన్నారని సీతారాంప్రసాద్ గుర్తు చేశారు. పాండురంగా రావు మృతి పార్టీకి తీరం లోటని కుటుంబానికి కూడా తీరని నష్టమని సీతారాం ప్రసాద్ నివాళులర్పించారు. సంతాపం తెలిపిన వారిలో నాగిడి బాలకృష్ణ ,వీర్ల వెంకయ్య, హరే రామ్, తిరుమల ధర్మరాజు, నాగిడి నారాయణరావు తదితరులున్నారు.

ముదినేపల్లిలో ఘనంగా రెవెన్యూ డే

విశాలాంధ్ర-ముదినేపల్లి : ముదినేపల్లి రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ డేను తహసీల్దార్ ఎస్.కె లతీఫ్ పాషా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు పొందకపోవ డానికి జాయిన్ ఎల్పీఎంల వల్ల వచ్చిన సమస్య పై తహసీల్దార్ దృష్టికి లబ్ధిదారులు తెచ్చారు. ఇందుకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ వీఆర్వోలు చిట్టూరి నాంచారయ్య, టి. బసవ రత్నం లను శాలువాలతో సత్కరించారు. ఆర్ఐ రాజశేఖర్, డిటి పవన్ కుమార్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హమాలీ కార్మికుల కూలి రేట్లు పెంచాలి

ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ డిమాండ్

విశాలాంధ్ర-ఏలూరు: నగరంలో పచారీ షాపులలో పనిచేస్తున్న లోడింగ్, అన్ లోడింగ్ ట్రాన్స్‌పోర్టు హమాలీ కార్మికుల కూలి రేట్లు పెంచాలని లాగుడు, తోపుడు బండ్ల సంఘం (ఏఐటీయూసీ) అధ్యక్షులు, ఏఐటీయూసీ కోశాధికారి పుప్పాల కన్నబాబు, జట్టు కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ) కార్యదర్శి గడసాల రాంబాబు డిమాండ్ చేశారు. ఏలూరు నగరంలో పచారీ షాపుల్లో పనిచేస్తున్న ఏఐటియుసి, ఐఎఫ్‌టీయూ సంఘాల కార్మికులు లోడింగ్ అన్లోడింగ్ ట్రాన్స్‌పోర్టు కూలి రేట్లు పెంచాలని కోరుతూ శుక్రవారం ప్రదర్శన, ధర్నా చేశారు. స్థానిక వై ఎమ్ హెచ్ ఏ హాల్ సెంటర్ నుండి భారీ ప్రదర్శనగా బయలుదేరి ఎన్.ఎస్.హోల్ సేల్ మార్కెట్ మీదుగా బిర్లా భవన్ సెంటర్ నుండి మర్చంట్ ఛాంబర్ నాయకులు బాలకృష్ణ షాపు వద్ద, బుర్రంశెట్టి బ్రహ్మయ్య షాపు వద్ద, ఛాంబర్ అసోసియేషన్ అధ్యక్షులు నేరెళ్ల రాజేంద్ర బాబు షాపు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి లాగుడు, తోపుడుబండ్ల సంఘం అధ్యక్షులు పుప్పాల కన్నబాబు మాట్లాడుతూ హమాలీల కూలి రేట్లు పెంపుదల విషయంలో జాప్యం చేయడం సరైన విధానం కాదని విమర్శించారు. కూలి రేట్ల పెంపుదల కోసం అసోసియేషన్ పెద్దలకు ముందుగానే వ్రాతపూర్వకంగా తెలిపామని, నేటి వరకు షాపుల యజమానులు కార్మిక సంఘాలతో చర్చలు చేపట్టలేదని విమర్శించారు. అనాది నుండి వస్తున్న సాంప్రదాయ పద్ధతులను కొనసాగించి, కార్మిక సంఘాలతో చర్చించి కూలి రేట్లు పెంచే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఐఎఫ్‌టీయూ అనుబంధ జట్టు కార్మిక సంఘం కార్యదర్శి గడసాల రాంబాబు మాట్లాడుతూ గత 50 సంవత్సరాల నుండి సాంప్రదాయంగా వస్తున్న రెండు సంవత్సరాలకు ఒకసారి కూలి రేట్ల ఒప్పంద పెంపుదల కాలపరిమితి ఏప్రిల్ 9వ తేదీతో ముగిసింద న్నారు. యజమానుల అసోసియేషన్ వారి దగ్గరకు అనేకసార్లు కార్మిక సంఘాల ప్రతినిధులు వెళ్లినా నేటికీ చర్చలకు ఆహ్వానించలేదని విమర్శించారు. మూడు నెలలు కావస్తున్నా యజమానుల వైపు నుండి ఎటువంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం శాంతియుతంగా చర్చలు జరపాలని, కూలి రేట్లు పెంచా లని యజమానులకు విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ నగర ప్రధాన కార్యదర్శి ఎర్ర శ్రీనివాసరావు, ఏఐటీయూసీ ఏలూరు కార్యదర్శి ఎ. అప్పలరాజు మాట్లాడారు. సంఘీభావంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఏఐటియుసి ఏలూరు నగర అధ్యక్షులు కె. కృష్ణమాచార్యులు మాట్లాడుతూ హమాలి కార్మికులు చేసే కూలి రేట్లు పెంపుదల పోరాటానికి తమ సంఘాల అనుబంధ కార్మిక వర్గాన్ని కూడా ఈ పోరాటంలో భాగస్వామి చేస్తామని తెలియజేశారు. మర్చంట్ ఛాంబర్ అసోసియేషన్ చర్చల ప్రక్రియ జరపాలని, ఛాంబర్ అసోసియేషన్ వారికి విజ్ఞప్తి చేశారు. ధర్నాలో ఏఐటియుసి జిల్లా నాయకులు పి. కిషోర్, నగర నాయకులు ఈ శ్రీనివాస్, జి. అప్పారావు, కె. సురేష్, కె. భాస్కరరావు, పి. నాగరాజు, ఎస్.బాబూరావు, ఎస్.సోమేశ్వరరావు, వై.శ్రీను, జి.దుర్గారావు, ఎం. మహేష్, ఐఎఫ్‌టీయూ నుండి ముంగం అప్పారావు, గునుపూడి నాగేశ్వర రావు, ఈశ్వరరావు, జనార్దన్, విష్ణు, అన్నవరం, కరణం రమణ, సతీష్, బిటిసి ఏలూరు నగర అధ్యక్ష, కార్యదర్శులు కాకర్ల శ్రీను, నౌడు నెహ్రూ బాబు, పీడీఎస్‌యూ నాయకులు కాకి నాని, మీసాల రమణ, కోరాడ అప్పారావు, గంగరాజు, విజయ్, ఘడసాల రమణ తదితరులు పాల్గొన్నారు.

నా మాటే శాసనం : గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయిని

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల : ద్వారకా తిరుమల అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలకు వెళ్లిన తమ పట్ల ఆ పాఠశాల ప్రిన్సిపాల్ దురుసుగా ప్రవర్తిస్తున్న దని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ద్వారకాతిరుమల గ్రామానికి చెందిన పొంగులేటి తేజస్విని స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీలో సీటు వచ్చింది. ఈ క్రమంలో ఆ విద్యార్థిని పెదనాన్న నాగేశ్వరరావు ఆ పాఠశాలకు వెళ్లి ప్రిన్సిపాల్ బెజవాడ రాణిని కలిశాడు. తమ పాపకు సీటు వచ్చింది ఆమె ఇక్కడ జాయిన్ కానంటుంది. ఆ సీటు మా చిన్న పాపకు ఇస్తారా అని అడిగాడు. దీంతో ప్రిన్సిపాల్ అగ్గి మీద గుగ్గిళం అయ్యింది. ఇది కూరగాయల బేరం అనుకుంటున్నారా వంకా యలు పుచ్చుపోతే బీరకాయలు, బీరకాయలు పుచ్చిపోతే వంకాయలు కొనడానికి అంటూ వెటకారంగా మాట్లాడారు. ఎమ్మెల్యే లెటర్ తీసుకురమ్మంటారా అని నాగేశ్వరరావు అడిగాడు. దీంతో ప్రిన్సిపాల్ రెచ్చిపోయి ఎమ్మెల్యే లెటర్ తెచ్చినా సీటు ఇవ్వడం కుదరదు అని దురుసుగా సమాధానం చెప్పారు. ఇక్కడ నుంచి బయటకు పొమ్మని అవమానించారు. ఈ విషయంలో జోక్యం చేసుకున్న స్థానిక సర్పంచి కుంటం స్వర్ణలతతో దురుసుగా వ్యవహరించారు. గతంలో కూడా పలువురు విద్యార్థుల తల్లిదండ్రులపై దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలు ఉన్నాయి. పాఠశాలను ఆశ్రయించే విద్యార్థుల తల్లిదండ్రుల పట్ల మర్యాద పూర్వకంగా నడుచుకొని సౌమ్యంగా సమాధానం చెప్పాల్సిన ప్రిన్సిపాల్ అమర్యాదగా మాట్లాడటం ఎంత వరకు సబబు అంటూ స్థానిక నేతలు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఇటువంటి ప్రిన్సిపాల్ పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని భవిష్యత్‌లో ఈ తరహా ప్రవర్తనకు పాల్పడకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

సీపీఐ ఏలూరు జిల్లా రెండవ మహాసభలు జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-చింతలపూడి: సీపీఐ ఏలూరు జిల్లా రెండవ మహాసభలు జూలై 5,6,7 తేదీలలో చింతలపూడి పట్టణంలో జరుగుతున్నాయని వీటిని జయప్రదం చేయాలని సీపీఐజిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల గురవయ్య పిలుపునిచ్చారు.శుక్రవారం రేచర్ల వన సంరక్షణ సమితి సభ్యుల సమావేశం ఇస్తారాకులు వెంకటేశ్వర రావు అధ్యక్షతన జరిగింది .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ పోరాట ఫలితంగా వన సంరక్షణ సమితులు ఏర్పడ్డాయని అన్నారు. వన సంరక్షణ సమితి సభ్యులకు వ్యక్తిగతంగా చెట్లు పెంచుకునే అవకాశం ఇవ్వాలని ఈనెల 5,6,7 తేదీలలో జరిగే సీపీఐ ఏలూరు జిల్లా రెండవ మహాసభలలో తీర్మానం ప్రవేశపెడతామని తెలిపారు. ఇది సాధించుకునేంత వరకు వీఎస్ఎస్ సభ్యులు పోరాటాలకు సిద్ధం కావాలని ఈ మహాసభల జయప్రదానికి అందరూ హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమా వేశంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి దంత కృష్ణ, ముళ్ళపూడి కృష్ణ,దంతా తిరుపతయ్య, పోలదాసు, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖలో ప్రతి ఉద్యోగి బాధ్యతగా విధులు నిర్వహించాలి

విశాలాంధ్ర -లింగపాలెం: ప్రజలకు రెవిన్యూ శాఖ కీలకమైనదని, ఈ శాఖ ద్వారా అధికారులు, సిబ్బంది చేసే సేవలు ప్రజలకు పారదర్శకంగా ఉండాలని లింగపాలెం మండల తహసీల్దార్ నజీముల్లాషా తెలిపారు. రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని లింగపాలెం రెవిన్యూ కార్యాలయంలో జరిగిన సమా వేశంలో తహసీల్దార్ రెవిన్యూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. రెవెన్యూ వ్యవస్థ ఏర్పడి 238 సంవత్సరాలు అవుతుందని తెలిపారు. ఇప్పుడు రెవిన్యూ వ్యవస్థలో అనేక నూతన విధానాలు ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు. ప్రజలకు రెవిన్యూ శాఖ కీలకమైనదని, ఈశాఖలో పని చేసే ప్రతి ఉద్యోగి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా విధులు నిర్వర్తించినప్పుడే సార్థకత ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ నాగబాబు, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ మాణిక్యాలరావు, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ నాయకులు కె. శ్రీనివాసరావు, కె. గోపి, పి. అప్పారావు, డి.రంగారావు తదితరులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.

కత్తితో యువతిపై దాడి : కేసు నమోదు

విశాలాంధ్ర-ముదినేపల్లి: తనను ప్రేమించాలంటూ యువతిని వేధిస్తుండగా తిరస్కరించినందుకు యువతిపై దొంగ సాయి రాత్రి వేళ మాటు వేసి ఇంటికి వెళ్లి తలుపుతట్టి కత్తితో దాడికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముదినేపల్లి మండలం కోడూరు గ్రామానికి చెందిన దొంగ సాయి అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమించానంటూ వెంటపడుతున్నాడు. ఈ క్రమంలో యువతి తిరస్కరించినట్లు దీంతో ఆ యువకుడు ఈమెపై కక్ష గట్టి ఎప్పటికైనా చంపేస్తానంటూ బెదిరిస్తూ కత్తితో దాడికి పాల్పడగా ఈమెకు గాయాలయ్యాయి. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పని గంటల పెంపు దారుణం

ఏఐటీయూసీ, సీఐటీయూ, టీయూసీసీ

విశాలాంధ్ర -భీమవరం: కార్మికుల పని గంటల పెంపు, మహిళలు రాత్రి సమయాలలో పనులు చేయడానికి అంగీకరిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణ

యాలు కార్మికులు, మహిళా కార్మికుల హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయని వాటిని వెంటనే ఉపసంహరించు కోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు జే.ఎన్.వి.గోపాలన్ డిమాండ్ చేశారు. పని గంటలు పెంపు, రాత్రి పని గంటల విధానాలను నిరసిస్తూ, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏఐటియుసి, సిఐటియు, టియుసిసి ఆధ్వర్యంలో శుక్రవారం భీమవరంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేస్తూ లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని, ఇదే బాటలో రాష్ట్ర ప్రభుత్వం వెళ్లడం ఆందోళన కలిగిస్తుందన్నారు. పని గంటల పెంపు విషయంలో కార్మికుల ఆరోగ్యం కానీ కనీస వేతనాలు కానీ పట్టించుకోకుండా ఏకపక్షంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని నాయకులు విమర్శించారు. మహిళా కార్మికులు, ఉద్యోగులు ఇప్పటికే అనేక ఇబ్బందులు పడుతున్నారని, దాడులకు గురవుతున్నారని వారికి రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర పాలకులు విఫలమవుతున్న విష యం స్పష్టంగా ఉందన్నారు. తక్షణమే రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న ఈ నిర్ణయాలను రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు లక్ష్మీపతి, టియుసిసి నర్సాపురం డివిజన్ కార్యదర్శి శ్రీనివాసరాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, కలిదిండి సత్యనారాయణ, బంగారు వరలక్ష్మి, నీలాపు రాజు, తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి మున్సిపల్ ఇంజనీరింగ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె

విశాలాంధ్ర - నరసాపురం: ఈ నెల 22 నుంచి సమ్మె చేపడుతున్నామని మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఐకాస ఆధ్వర్యంలో శుక్రవారం కమిషనర్ ఎం. అంజయ్యకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆ

సంఘం నాయకులు మాట్లాడుతూ ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగపు కార్మిక సంఘాలు ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు మేరకు సమ్మె చేపడుతున్నామన్నారు. ఎంతో కాలంగా సమస్యలు పరిష్కారానికి గతం నుంచి ఎన్నో సార్లు వినతి పత్రాలు అందజేశామన్నారు. ప్రభుత్వం కూడా తమ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టలేదన్నారు. 34 రోజులుగా సంఘ నాయకులు కార్యాచరణ చేపడుతున్నా పట్టించుకోలేదన్నారు. దీనిలో భాగంగా సమ్మెకు నోటీసు అందజేసినట్టు పేర్కొన్నారు. సమ్మె కారణంగా రాష్ట్రంలోని ప్రజలకు అసౌకర్యం కలిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో కె.రత్నం, వి. ఫణి సత్యనారాయణ, పార్థు, కె. వెంకట కృష్ణ బ్రహ్మాజీ, రామకృష్ణ, మధు, అనురాజు, సుజాత, వాసు, శ్రీను, కాశీ తదితరులు పాల్గొన్నారు.

కాలువల ప్రక్షాళనకు చర్యలు

విశాలాంధ్ర - నరసాపురం: సార్వా పంటకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలంలోని రుస్తుంబాద మురుగు డ్రెయిన్లో పూడికతీత పనులను శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో కాలువలు, డ్రెయిన్లు ప్రక్షాళన పనులు చేపట్టామన్నారు. ఈ పనులు త్వరగా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా డెల్టా వైస్ చైర్మన్ గుబ్బల మర్రాజు ,బందెల రవీంద్ర, గంట కృష్ణ, పట్టిప్రోలు సతీష్, నిప్పులేటి తారక రామారావు, పులి భుజంగరావు, ఇంటి మురళి అడబాల బాబు తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయండి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: జిల్లా వ్యాప్తంగా జూన్ 21న శనివారం నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించే యోగా కార్యక్రమాల ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో గూగుల్ మీట్ నిర్వహించారు. శనివారం నిర్వహించే యోగా కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో, సజావుగా జరిగేలా అధికారులు సమన్వ యంతో పనిచేసి విజయవంతం చేయాల న్నారు. విశాఖ పట్నంలో భారత ప్రధాని శనివారం ఉదయం 7.00 నుండి 8.00 గం.ల వరకు యోగా కార్యక్రమంలో పాల్గొంటారని, అదే సమయంలో జిల్లా వ్యాప్తంగా యోగా కార్యక్రమాలు ప్రారంభ మయ్యే విధంగా సన్నద్ధం చేయాలని అధికారులు ఆదేశించారు.

కలెక్టరేట్ గ్రౌండ్స్‌లో 5 వేల మందితో యోగ

కలెక్టరేట్ గ్రౌండ్స్ నిర్వహించే యోగా కార్యక్రమం ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించి ఏర్పాట్లన్నీ పక్కాగా పూర్తి చేయా లని సూచించారు. వివిధ కళాశాలల నుండి విద్యార్థులను తీసుకొస్తున్న బస్సుల పార్కింగ్‌ను క్రమ పద్ధతిలో చేయించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రవాణా శాఖ అధికారి శాఖ అధికారి బి.ఉమామహేశ్వరరావు, డీఈవో ఇ. నారాయణ, డిఈఓ ఆఫీస్ ఎడి సత్యనారా యణ, డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియట్ అధికారి నాగేశ్వరరావు, డ్వామా పీడీ డాక్టర్ కే సిహెచ్ అప్పారావు, జిల్లా టూరిజం అధికారి ఎ.వి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర - నరసాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు మున్సిపల్ పారిశు ధ్య కార్మికులకు అమలు జరపాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు నెక్కంటి సుబ్బారావు అన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పురపాలక కమిషనర్ ఎం.అంజయ్యకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దీర్ఘకాలం గా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టాల న్నారు. ఆప్కాస్‌లో చేర్చాల్సిన సభ్యులను తక్షణమే చేర్చాలన్నారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ సిబ్బంది కి కనీస వేతనం 26 వేలు రూపాయలు ఇవ్వాలన్నారు. దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న డీ ఏ లు,సరెండర్ లీవులు, సబ్బులు, కొబ్బరి నూనె ఇవ్వాల న్నారు. పదవీ విరమణ, చనిపోయిన వారి

స్థానాలలో ఉద్యోగాల భర్తీ చేయాల న్నారు. పదవి విరమణ చేసిన వారికి రావల్సిన బకాయిలు ఇప్పించాలన్నారు. టీఎల్ ఎఫ్ ద్వారా పని చేసేవారి జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు ఆరేటి మృత్యుంజయరావు, నీలాపు శివ ప్రసాద్, వై. రాము,జి. శ్రీనివాసరావు, ఎల్.రత్తయ్య, సుజాత కుమారి, ఎస్. అమరావతి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఏలూరు ఏరియా మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-ఏలూరు : సీపీఐ ఏలూరు ఏరియా ఆరవ మహాసభలు జయప్రదం చేయాలని సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఏలూరు ఏరియా 16వ డివిజన్ సమావేశం కొండేటి మేరీ అధ్యక్షతన అరుంధతి పేటలో శుక్రవారం జరిగింది. సమావేశంలో పాల్గొన్న హేమ శంకర్ మాట్లాడుతూ ఏలూరు ఏరియా సమితి 6వ మహాసభలు ఈనెల 21,22 తేదీలలో ఏలూరు నగరంలో జరుగనున్న నేపథ్యంలో ఉదయం గం.10లకు ఆర్ఆర్ పేట,స్ఫూర్తి భవన్ నుండి మున్సిపల్ కార్యాలయం వరకు ప్రజా ప్రదర్శన నిర్వహించి అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద బహిరంగ సభ జరుగుతుందని , పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. 16వ డివిజన్ కార్యదర్శి కొల్లూరి సుధారాణి మాట్లాడుతూ ఏలూరు నగరంలో గత ప్రభుత్వం ఇచ్చిన సెంటు ఇళ్ల స్థలాలను, రెండు సెంట్లుగా పెంచి తక్షణమే ఇవ్వాలని, టిడ్కో ఇళ్లకు మౌలిక వసతులు కల్పించి తక్షణమే లబ్ధిదారులకు అందించాలని ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో 16వ డివిజన్ సభ్యులు రాజమణి, ఉప్పులూరి జోజి మేరీ, ఉప్పులూరి లక్ష్మి, భవాని సుజాత,తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జంగారెడ్డిగూడెం మండల నూతన కార్యవర్గం ఎన్నిక

కార్యదర్శిగా వెంకటరమణ రాజు, సహాయ కార్యదర్శిగా రాధాకృష్ణ

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాల్‌లో సీపీఐ జంగారెడ్డిగూడెం మండల 11వ మహాసభ సీపీఐ జిల్లా సమితి సభ్యులు కుంచే వసంతరావు, నిట్టా స్వర్ణ కుమారి అధ్యక్షతన విజయ వంతంగా జరిగింది. ఈ మహాసభలో

సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, బి.కే.ఎం.యు. జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఆంధ్ర ప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం ధారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు బాడిస రాము ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ మహాసభలో నూతన కమిటీ ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా జంపన వెంకట రమణ రాజు, సహాయ కార్యదర్శిగా సుంకర రాధాకృష్ణ (బాబు), 9 మంది కార్యవర్గ సభ్యులు, 21 మంది కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి జంపన వెంకటరమణరాజు మాట్లాడుతూ మండల కార్యదర్శిగా ఎన్నుకున్న పార్టీ సభ్యులకు, పార్టీ జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. బయనేరుపై బ్రిడ్జి నిర్మించాలని, అసంపూర్తిగా మిగిలిన పట్టిన పాలెం బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని, తాడివాయి గ్రామంలో అన్యాక్రాంతమైన భూదాన యజ్ఞ భూములను వాస్తవ లబ్ధిదారులకు అందజేయాలని, పేరంపేట కేతవరం, గ్రామాల్లో ఉన్న సీలింగ్ భూములు పేదలకు పంచాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ద్వారకాతిరుమల మండల కార్యదర్శి గొలివే బాలయేసు,చిలంతల రాజు శ్రీను,చందా త్రిమూర్తులు, కలపాల శ్రీరాములు, నాగరాజు, హనుమంతు, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ సీనియర్ నాయకుడి మృతి

విశాలాంధ్ర-లింగపాలెం: సీనియర్ వైసీపీ నాయకుడు టి.సి.హెచ్. ఆర్.పాలెం నివాసి కొఠారు సూర్యనారాయణ (70) అనారోగ్యంతో విజయవాడ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందారు. ఈయన తనయుడు కొఠారు మోహన్ లింగపాలెం మండలానికి వైసీపీ అధ్యక్షులుగా పనిచేస్తున్నారు. నిజాయితీ గల నాయకునిగా పేరున్న సూర్యనారాయణ మృతి పట్ల గ్రామంలోని వైసీపీ నాయకులతో పాటు ఇతర పార్టీ నాయకులు, మండలంలోని వైసీపీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. లింగపాలెం మండల పరిషత్ అధ్యక్షురాలు మునునూరు వెంకటలక్ష్మి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు మట్టా సురేష్, ఝాన్సీ, కార్మిక శాఖ రాష్ట్ర మాజీ చైర్మన్ నవీన్ బాబు, లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగా సందీప్, మునునూరు వెంకటేశ్వరరావు, మందలపు సాయిబాబా, వైసీపీ ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ సర్పంచులు సంతాపం తెలిపారు.

VASTU HOUSING FINANCE

వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

యూనిట్ 203 & 204. 2 వ అంతస్తు, "ఎ" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బందర్ రోడ్, సేవ్రి (వెస్ట్), ముంబై 400015. మహారాష్ట్ర.

సిఐఎన్ నం. : యు65922ఎంహెచ్2005పిఎల్సి272501

స్వాధీనత ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్టు చట్టం -2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు-2002 నిబంధన 9తో చదివే సెక్షన్ 13(12) కింద అతనికి సంక్రమించిన అధికారాలను ఉపయోగించి వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ అధీకృత అధికారిగా ఈ దిగువ సంతకందారు ఈ కింద పేర్కొన్న రుణగ్రహీతలకు సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజుల్లోగా సంబంధిత నోటీసులో పేర్కొన్న బకాయిలను తిరిగి చెల్లించవలసిందిగా ఈ కింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. రుణగ్రహీతలు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున పైన పేర్కొన్న చట్ట నిబంధనల్లో నిబంధనల 9తో చదివే సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ కింద వివరించబడిన ఆస్తిని దిగువ సంతకందారు ఈ కింద వివరించిన షెడ్యూల్ ఆస్తిని స్వాధీనం చేసుకోవడమైనది.

ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నెరపరాదని,ఈ ఆస్తితో ఏ ఒప్పందాలైనా ఈ కింద పేర్కొన్న మొత్తం బకాయి మరియు దానిపై వడ్డీ, వ్యయాలు మొదలైనవాటి కొరకు వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ బ్రాంచ్ చార్జికి లోబడి వుండునని ప్రత్యేకించి రుణగ్రహీత, హామీదారు మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

వ. సం.	రుణగ్రహీత, సహ-రుణగ్రహీత పేరు మరియు లోన్ ఎక్కౌంట్ నం.	డిమాండ్ నోటీసు తేదీ మొత్తం బకాయి	ఆస్తి యొక్క వివరాలు	స్వాధీనత రకం & తేదీ
1	లక్ష్మీ కానూరి, శ్రీను కానూరి, విజయదుర్గ ప్రసాద్ కానూరి LP0000000095400	11- ఫిబ్రవరి-25 10-ఫిబ్రవరి-25 నాటికి రూ.968621/-	ఆంధ్రప్రదేశ్, పశ్చిమగోదావరి జిల్లా-534342, కొవ్వూరు సబ్ రిజిస్ట్రీ, చాగల్లు మండలం, చాగల్లు గ్రామం, చాగల్లు గ్రామ పంచాయతీ, 13వ వార్డు, ఆర్.ఎస్.నం.669/6ఎ, డోర్ నం.13-29తో కూడిన ఆర్‌సిసి భవనంతో పాటు 83 1/2 చదరపు గజాల స్థలం. హద్దులు: ఉత్తరం: పట్టపు బాబూరావు కాంపౌండ్ గోడ, దక్షిణం: కానూరి ఈశ్వరరావు ఇల్లు మరియు స్థలం. తూర్పు: పంచాయతీ రోడ్డు, పడమర: కానూరి అనసూయ స్థలం.	లాంఛనప్రాయ స్వాధీనత స్వాధీనత తేదీ: 18-జూన్ -2025

తేదీ: 21.06.2025 అధీకృత అధికారి
ప్రదేశము: పశ్చిమగోదావరి వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

యోగ దినోత్సవం విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - సీతానగరం: యోగా దినోత్సవం విజయవంతం చేయాలని ఎంపీడీవో ఎమ్ భారతి, తహసీల్దార్ ఏ శ్రీనివాస్ కోరారు. మండలంలో సీతానగరం గ్రామంలో పువ్వాడ సత్యమాంబ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నేడు శనివారం అంతర్జాతీయ 11వ యోగా దినోత్సవం సందర్భంగా మండల స్థాయి యోగ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 2014లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన కృషి ఫలితంగా, ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించింది. 2014 డిసెంబర్ 11న ఐక్యరాజ్యసమితి 69వ జనరల్ అసెంబ్లీ సమా వేశంలో ఈ తీర్మానాన్ని ఆమోదించింది అన్నారు. యోగా మన ప్రాచీన సంప్రదాయం నుండి వచ్చిన ఒక అమూల్యమైన బహుమతి. యోగా మనసు, శరీరం, ఆలోచన, క్రియల ఐక్యతను సూచిస్తుం దన్నారు. యోగ మన ఆరోగ్యం, శ్రేయస్సుకు విలువైన సంపూర్ణ విధానం. యోగా కేవలం వ్యాయామం మాత్రమే కాదు అని యోగా మనస్సును, శరీరానికి నిత్యం ఉల్లాసంగా ఉత్సా హంగా ఉంచుతుంది అని అన్నారు. సీతానగరం మండలంలో కస్తూర్బా గాంధీ ఆశ్రమం స్వతంత్ర సమరంలో ఒక ప్రత్యేక స్థానంలో నిలిచిందని అలాంటిది ఈ యోగా దినోత్సవం చరిత్రను గుర్తు చేస్తూ ప్రజలు యోగా దినోత్సవంలో పాల్గొని ఒక సరికొత్త రికార్డు నమోదు చేయాలని కోరారు.

పేకాట శిబిరంపై దాడి

విశాలాంధ్ర - కరప : కరప మండలం నడకుదురు గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నమని ఎస్సై టి సునీత పేర్కొన్నారు. రూ.8220 నగదు, 104 పేక ముక్కలను పట్టుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భూముల విభజనకు ఫీజు మినహాయింపు : జేసీ

విశాలాంధ్ర - అమలాపురం : సర్వే పూర్తి కాబడిన గ్రామముల వెబ్ ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదు కాబడిన భూ యజమానులు వారియొక్క భూములను విభజన చేయుటకు ప్రభుత్వంవారు నిర్దేశించిన 500 రూపాయల రుసుమును పూర్తిగా మినహాయించి ఉచితంగా ఈ సేవను పొందుటకు అవకాశము కల్పించ డమైనదని జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషాంతి చెప్పారు. దీనికి గాను కేవలం నామ మాత్రపు దరఖాస్తు రుసుము రూ. 50లు గ్రామ సచివాలయము నందు చెల్లించి జూన్ 30లోపు దరఖాస్తు చేసుకొనవలసి నదిగా జేసీ నిశాంతి విజ్ఞప్తి చేశారు. ఈ సదా వకాశాన్ని జాయింట్ పట్టాదారులు అందరూ ఉపయోగించుకుని జాయింట్ పట్టాలను విడివిడిగా విభజన చేయించుకోవలసినదిగా కోరారు. దీనివలన ప్రభుత్వ సంక్షేమ పథకాలైన 'అన్నదాత సుఖీభవ', 'తల్లికి వందనం' ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులుగా గుర్తించబడతారన్నారు. జాయింట్ పట్టాదారులుగా నమోదు కాబడిన భూ యజ మానులు జాయింట్ పట్టా విభజన కొరకు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలసినదిగా జేసీ తెలియజేసారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కొవ్వూరు : నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను గ్రీవెన్స్ ద్వారా అడిగి తెలుసుకొని సత్వరం పరిష్కరించేందుకు కృషి చేయడం జరుగుతుందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం కొవ్వూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సుపరిపాలన అందించడమే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. నియోజకవర్గ పరిధిలో ప్రజల సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించి సత్వరమే పరిష్కరించడం జరుగుతుందన్నారు. గ్రీవెన్స్ ద్వారా ప్రజలు నేరుగా ఎమ్మెల్యేను కలిసి వారి సమస్యలను తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు బోడపాటి ముత్యాలరావు, జనసేన కొవ్వూరు మండల అధ్యక్షులు సుంకర సత్తిబాబు, మద్దూర్ సర్పంచ్ బాబ్జి, ప్రజలు పాల్గొన్నారు.

యోగా విజయవంతం చేయండి

విశాలాంధ్ర - తాళ్లపూడి : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా 21 శనివారం యోగాంధ్ర పేరుతో మండలం లోని అనేక కేంద్రాలలో గ్రామస్థాయి యోగ ప్రదర్శనలు చేపడతారని, మండల స్థాయిలో వేగేశ్వరపురం ప్రభుత్వ హై స్కూల్ నందు యోగా కార్యక్రమం నిర్వహిస్తా మని తాళ్లపూడి ప్రత్యేకధికారిని అమ్మాజి, తహశీల్దార్ లక్ష్మీ లావణ్య లు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల స్థాయి అధికారులంతా పాల్గొనాలని కోరారు. ఆకట్టుకున్న యోగ ప్రదర్శన మండల కేంద్రమైన తాళ్లపూడిలో గాయత్రీ యోగా సేవా సమితి ఆధ్వర్యంలో యోగా మాస్టర్ నక్కా వెంకటేశ్వర రావు పర్యవేక్షణలో యోగాసనాలు ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమం లో యోగా కేంద్రం లో శిక్షణ పొందిన ఏ.ఎస్.ఓ జోడాల వెంకట్ తో పాటు పలువురు యోగా ఆశనాలు లో ప్రతిభను కనబరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి డి.ఎల్.పి.ఓ అమ్మాజి మరియు తహసీల్దార్ లక్ష్మీ లావణ్య, తాళ్లపూడి ఈవోఆర్ వీరన్న జిల్లా బీజేపీ అధ్యక్షులు పీక్కి నాగేంద్ర, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సింహాద్రి జనార్ధన్ , మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు నామన పరమేశ్వర రావు, పట్టణ బీజేపీ అధ్యక్షులు ఇందుగుల రామకృష్ణ, కలిశెట్టి సన్యాసి నాయుడు, రాజేష్, సాక్షి సత్యనారాయణ, సూర్యదీప్తి జయధ్వని ఎడిటర్ రాధ కృష్ణ పాల్గొని యోగా దే విషెస్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిబ్బంది, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్ర విజయవంతం చేయండి

విశాలాంధ్ర - అనపర్తి : ప్రజలంతా యోగాంధ్ర లో భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో మండ రామ కృష్ణారెడ్డి కోరారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ స్థానిక గ్రామపంచాయతీ వద్ద నుంచి దేవి చౌక్ వరకు యోగాంధ్ర కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ఉదయం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, ఉపాధ్యా యులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొం టారని గ్రామ ప్రజలంతా పెద్ద ఎత్తున పాల్గొనాలని ఎంపీడీవో రామకృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు.

ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నేడు శు క్రవారం 10వ ప్రజాదర్బార్‌ను రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కార్యాలయం వద్ద నిర్వహిం చారు. ప్రజలు, పార్టీ కార్యకర్తలు పాల్గొని తమ సమస్యలను తెలిపారు. శుక్రవారం 21 వినతులు స్వీకరించి వాటిలో 3 వ్యక్తిగత వైద్య అర్జీలను అప్పటికప్పుడు పరిష్కరించామని క్యాంపు కార్యా లయం ఇంచార్జ్ మేకా లక్ష్మణమూర్తి తెలియ జేసారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ న్యూటన్, తలాటం హరీష్, చింతపల్లి అర్జున్, DRUCC మెంబెర్ ముత్యాల అనిల్, లాయర్ దుర్గాప్రసాద్, జిన్నూరు బాబ్జి, పిపి గోరీ శంకర్ పాల్గొన్నారు.

యోగాంధ్ర జయప్రదంచేయండి

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమ పర్యవేక్షణ అధికారులతో మండల స్పెషల్ ఆఫీసర్ యంవి రామారావు, ఎంపిడిఓ బికెఎస్ ఎస్ వెంకట రామన్, మరియు మండల విద్యాశాఖధికారి వారల అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశములో 21న అంతర్జాతీయ యోగాంధ్ర దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర పర్యవేక్షణ అధికారులు అందరు ఉదయం గం.6.00 వారికి నియమిం చబడిన గ్రామాలకు వెళ్ళి అందరిని కో. కో-ఆర్డినేషన్ చేసుకొని యోగాంధ్ర విజయవంతం చేయాలని ఈ సమావేశములో యోగాంధ్ర పర్యవేక్షణ అధికారులు పాల్గొన్నారు.

తారక్ నాథ 21వ వర్ధంతి

విశాలాంధ్ర - రాజోలు : ఎస్‌బిఐ స్టాఫ్ యూనియన్ నాయకులు కామ్రేడ్ తారక్ నాథ 21వ వర్ధంతిని శనివారం రాజోలు, తాటిపాక, మామిడికురుదు లక్కవరం ఎస్‌బిఐ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా రాజోలు మానసిక వికలాంగుల మనోవికాస కేంద పిల్లలకు కుర్చీలు, వాటల్ డ్రీమ్, కిరాణా సామాగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్లు ఎంఆర్వీఆర్ గోపాలం, శ్రీనివాసరావు, సురేష్, విజయబాబు, దుర్గా ప్రసాద్, కళ్యాణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల బస్సులకు ఫిట్నెస్ తప్పనిసరి

విశాలాంధ్ర - సీతానగరం : పాఠశాల బస్సులకు ఫిట్నెస్ తప్పనిసరి అని రాజ మహేంద్రవరం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జి రామనారాయణ అన్నారు. మండలంలో సీతానగరం గ్రామంలో పోలీస్ స్టేషన్‌లో గత కొన్ని రోజులు క్రితం ఆటో ప్రమాదానికి గురికావడంతో కేసు నమోదు చేశారు. ఈ కేసుపై శుక్రవారం మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ రామనా రాయణ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. రామనారాయణ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మోటర్ వాహనాల ఫిట్నెస్ ధృవ పత్రాలు మంజూరు చేయడానికి ఒక ప్రైవేటు సంస్థ అయిన ఏ టి ఎస్ (ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్) అనే దాని ద్వారా జరుగుతుం దన్నారు. జిల్లాలో 90 శాతం పాఠశాల బస్సులకు ఫిట్నెస్ పూర్తి అయ్యిందన్నారు. త్వరలోనే ఆకస్మిక తనిఖీలు నిర్వ హించి లేని వాటిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. పజలందరూ తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు.

VASTU HOUSING FINANCE

వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

యూనిట్ 203 & 204, 2 వ అంతస్తు, "ఎ" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బందర్ రోడ్, సేవ్రి (వెస్ట్), ముంబై 400015. మహారాష్ట్ర.

సిఐఎన్ సం. : యు65922ఎంహెచ్2005పిఎల్‌సి272501

స్వాధీనత ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్టు చట్టం -2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు-2002 నిబంధన 9తో చదివే సెక్షన్ 13(12) కింద అతనికి సంక్రమించిన అధికారాలను ఉపయోగించి వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ అధీకృత అధికారిగా ఈ దిగువ సంతకందారు ఈ కింద పేర్కొన్న రుణగ్రహీతలకు సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజుల్లోగా సంబంధిత నోటీసులో పేర్కొన్న బకాయిలను తిరిగి చెల్లించవలసిందిగా ఈ కింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. రుణగ్రహీతలు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున పైన పేర్కొన్న చట్ట నిబంధనల్లో నిబంధనల 9తో చదివే సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ కింద వివరించబడిన ఆస్తిని దిగువ సంతకందారు ఈ కింద వివరించిన షెడ్యూల్ ఆస్తిని స్వాధీనం చేసుకోవడమైనది.

ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నెరపరాదని,ఈ ఆస్తితో ఏ ఒప్పందాలైనా ఈ కింద పేర్కొన్న మొత్తం బకాయి మరియు దానిపై వడ్డీ, వ్యయాలు మొదలైనవాటి కొరకు వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ బ్రాంచ్ చార్జికి లోబడి వుండునని ప్రత్యేకించి రుణగ్రహీత, హామీదారు మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

వ. నం.	రుణగ్రహీత, సహ-రుణగ్రహీత పేరు మరియు లోన్ ఎక్కౌంట్ నం.	డిమాండ్ నోటీసు తేదీ మొత్తం బకాయి	ఆస్తి యొక్క వివరాలు	స్వాధీనత రకం & తేదీ
1	నాగ మురళీకృష్ణ దొమ్మేటి, కొండయ్య దొమ్మేటి, నాగమణి దొమ్మేటి, దుర్గాదేవి చిత్రోతు LP000000016602 & LP0000000034163	15- జనవరి-25 08-జనవరి-25 నాటికి రూ.1972451 & రూ.299775	ఆంధ్రప్రదేశ్, తూర్పుగోదావరి జిల్లా-పిన్-533125, కడియం మండలం, కడియం, వేమగిరి గ్రామ పంచాయతీ, వేమగిరి గ్రామం, బ్లాక్ నం.10, ఆర్.ఎస్.నం.336/2, డి.నం.10-199. కొలత: 109.55 చదరపు గజాలు లేదా 91.60 చదరపు మీటర్ల విస్తీర్ణం. హద్దులు: ఉత్తరం: సమానస వెంకటేశ్వరరావు ఇల్లు, దక్షిణం: రోడ్డు, తూర్పు: సమానస వెంకటేశ్వరరావుకు చెందిన ప్యాసేజ్ దారి, పడమర: పితాని శ్రీనివాసరావుకు చెందిన ఇల్లు.	లాంఛనప్రాయ స్వాధీనత స్వాధీనత తేదీ: 18-జూన్ -2025

తేదీ: 21.06.2025
ప్రదేశము: తూర్పుగోదావరి

అధీకృత అధికారి
వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

అందరి జీవితంలో యోగా భాగం కావాలి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : యోగా కేవలం ఒకరోజుకే పరిమితం కాకుండా, ప్రతిఒక్కరి జీవితంలో యోగ ఒక భాగం కావాలనీ తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి అన్నారు. మండలంలోని దివాన్ చెరువు అటవీశాఖ పరిధిలోని గోదావరి మహా పుష్కరవనంనందు అటవీశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి యోగాంధ్ర సాధనకు ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు లు హాజరై ఆసనం,శ్వాస ప్రక్రియ, ధ్యానం పై సాధనాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రంగా, ప్రజా ప్రతినిధులు, యోగ గురువులు నెల రోజులు పాటు ప్రజలకు యోగాపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో రెండు కోట్ల మంది ప్రజలకు యోగపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. యోగాంధ్ర కార్యక్రమం ప్రజల్లోకి విస్తృతంగా జిల్లా, నియోజకవర్గం, మున్సిపాలిటీల్లో, మండల, గ్రామ, సచివాలయాల పరిధిలో వేడుకగా యోగా సాధన కార్యక్రమం నిర్వహించడానికి ప్రత్యేక అధికారులు, ఇతర క్షేత్ర స్థాయి అధికారులను, అన్నీ ప్రభుత్వ, ప్రవేటు విద్యా సంస్థలను సిద్ధం చేశామన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ ప్రజలందరికీ స్వచ్ఛమైన గాలినీ ఇవ్వాలనే ఉద్దేశంతో గతంలో రాష్ట్రంలో కొన్ని జిల్లాలను ఎంపిక చేసి 2014లో ఐదు కోట్లతో అటవీ శాఖలో గోదావరి పుష్కర వనాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రధానమంత్రి మోదీ ప్రతి ఒక్కరూ యోగా చేసే విధంగా చర్యలు తీసుకోవడం ఆనందదాయక మన్నారు. ఈ సందర్భంగా చీఫ్ కన్సర్వే టివ్ ఆఫ్ ఫారెస్ట్ మూర్తి, మాట్లాడుతూ ప్రపంచానికి అవసరమైన యోగాని ప్రజలందరికీ ఒక బహుమతిగా ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రతిరోజు 20 నుండి 30 నిమిషాల వరకు యోగ చేయగలిగితే ప్రతి ఒక్కరూ ఆనందంగా, శాంతియుతంగా, ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి టి సీతారామ మూర్తి , జిల్లా అటవి అధికారి వి. ప్రభాక రరావు , ఈ యోగా సాధన కార్యక్రమంలో శ్రీనివాస రెడ్డి, ఫారెస్ట్ అకాడమీ సభ్యులు, పిడి డీఆర్డిఏ ఎన్.వి.వి.ఎస్ మూర్తి, డ్వాక్రా మహిళలు, ప్రభుత్వ సంగీత కళాశాల మల్లాది నరసింహారావు బృందం గీతాలాపన చెయ్యడం జరిగింది.

ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం ప్రాధాన్యత

విశాలాంధ్ర-మామిడికుదురు : ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహించేందుకు ఎంతో ప్రాధాన్యత యిస్తుందనీ జిల్లా వ్యవసాయాధికారి బోసు బాబు తెలిపారు. ఈదరాడలో ప్రకృతి వ్యవసాయం క్షేత్రాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఇటీవల కాలంలో ప్రకృతి వ్యవసాయం సాగు గణనీయంగా పెరిగిందన్నారు. దీనివల్ల తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించే అవకాశం ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటలకు మార్కెట్లో డిమాండ్ ఎక్కువగా ఉందని చెప్పారు. ఆయన వెంట ప్రకృతి వ్యవసాయం ఈదరాడ యూనిట్ ఇంచార్జీ కుడుపూడి జానకి, ఐసిఆర్పీలు చెల్లుబోయిన రాధ, గోగి లెనిన్, కె స్వాతి నాగ దుర్గ, స్థానిక రైతులు పాల్గొన్నారు.

టీడీపీ మండలశాఖ అధ్యక్షుడిగా బోనం బాబు



విశాలాంధ్ర - మామిడికుదురు : తెలుగు దేశం పార్టీ మామిడికుదురు మండల శాఖ అధ్యక్షుడిగా బోనం సత్య నాగేశ్వర రావు (బాబు) ఎన్నికయ్యారు. శుక్రవారం మామిడికుదురులో జరిగిన సమావేశంలో ఎన్నిక ప్రక్రియ జరిగింది. టీడీపీ మండల శాఖ అధ్యక్ష పోటీకి ఇద్దరు పోటీ పడటంతో మెజార్టీ వర్గీయులు బోనం బాబు మద్దతు తెలిపారు. పి గన్నవరం నియోజక వర్గం పరిశీలకులు షరీఫ్, రెడ్డి సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీ చైర్మన్ నామన రాంబాబు, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, ఈలి శ్రీనివాస్, మొల్లేటి శ్రీనివాస్, సుధా బాబ్జీ, కొమ్ముల నందుబాబు, చుట్టుగుల్ల కిషోర్, జాలెం సుబ్బారావు, మద్దల కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

విశాలాంధ్ర - అనపర్తి : ప్రతి ఒక్కరు తన తల్లి పేరుతో ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యత తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షులు కర్రి బుల్లిరెడ్డి అన్నారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాలతో పెదపర్తి, కుతుకులూరు, మహేంద్రవాడ, కొప్పవరం, పొలమూరులో మొక్కలు నాటడం జరిగిందని బుల్లి రెడ్డి తెలిపారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడంతోపాటు గ్లోబల్ వార్మింగ్ అధిగమించడం కోసం మొక్కలు నాటాలని కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చినట్లు బుల్లి రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షులు తాడి గంగిరెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ ఉపాధి కూలీలు, ఎన్డీఏ కూటమి నేతలు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న నరసింహారావు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : ఈతకోట గ్రామంలో జాతీయ రహదారి చెంతనే కొత్త సెంటర్ నందు కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మని శుక్రవారం కొత్తపేట నియోజకవర్గం పరిధిలోని ఆత్రేయపురం మండలం అంకంపాలెం గ్రామ మాజీ సర్పంచ్. వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్. గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్. టీడీపీ సీనియర్ నాయకులు కరుటూరి నరసింహారావు దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయం 40వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మ వారిదర్శనానికి విచ్చేసిన నరసింహారావుకు ఆలయ కమిటీ చైర్మన్ వెలుగొట్ల రామకృష్ణ కమిటీ సభ్యులు వారి ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు ఖండవిల్లి నారాయణచార్యులు (నాని) ప్రత్యేక పూజలు నిర్వహించి మ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

ఫ్లెక్సీల చించివేతపై కేసు నమోదు

విశాలాంధ్ర - రాజానగరం : రాజానగరం పోలీసు స్టేషన్ పరిధిలోని తొర్రేడు గ్రామంలో ఏర్పాటు చేసిన టీడీపీ నేతల ఫ్లెక్సీలు చించివేతపై రాజానగరం పోలీసు స్టేషన్లో గురువారం రాత్రి కేసు నమోదైంది. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రుడా చైర్మన్, నియోజకవర్గ టీడీపీ అధ్యక్షులు బొడ్డు వెంకట రమణ చౌదరి ఛాయచిత్రాలతో తొర్రేడు గ్రామంలోనీ టీడీపీ పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను అదే పార్టీకి చెందిన ముగ్గురు వ్యక్తులు చించే యడంతో చర్చనీయమైంది. దీంతో తొర్రేడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మద్దుకూరి లక్ష్మణుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫ్లెక్సీల రగడపై రాజానగరం పోలీసులు ఆరా తీశారు. సీతానగరం మండలానికి చెందిన గెడ్డం అనిల్, కాట్రగడ్డ శివ, చిట్టూరి సుధీర్ అనే ముగ్గురు వ్యక్తులు తమ పార్టీ కార్యాలయం వద్దకు వచ్చి అక్కడ ఉన్న బ్యానర్లను పరిశీలించి బ్యానర్లపై ఉన్న నాయకుల ఫోటోలు చూసి దుర్భాషలాడి, కాట్రగడ్డ శివ బ్యానర్లను నిర్లక్ష్యంగా చేతితో చింపివేసాడని ఈ విషయంలో గెడ్డం అనిల్, చిట్టూరి సుదీర్ అనువారు శివను రెచ్చగొట్టిపై సంఘటనకు కారకులయ్యారని మద్దుకూరి లక్ష్మణుడు పోలీసులుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో ఆ ముగ్గురు వ్యక్తులు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ మేరకు ఎస్ఐ కె.వెంకట నాగార్జున తెలిపారు.

ప్రజా సేవలో రెవెన్యూ శాఖ : శ్రీనివాస్

విశాలాంధ్ర - సీతానగరం: ప్రజా సేవలో నిత్యం అందుబాటులో రెవెన్యూ శాఖ ఉంటుంది అని తహసీల్దార్ ఏ శ్రీనివాస్ అన్నారు. మండలంలో సీతానగరం గ్రామంలో రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాస్ అధ్వర్యంలో తొర్రిగడ్డ ఛైర్మెన్ వేగి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా రెవెన్యూ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం రాక ముందు ఈస్ట్ ఇండియా పాలకులు 1786 జూన్ 20న రెవెన్యూ బోర్డు ఏర్పాటు చేశారు. ఈ బోర్డు ఏర్పాటు అయినా 238 ఏళ్ల తర్వాత ఏపీలో రెవెన్యూ డే ప్రకటించడం విశేషమన్నారు. ప్రజలకు భూ సంబంధిత సేవలు, ధృవ పత్రాలను అందించడంలో రెవెన్యూ ఎల్లపుడూ సిద్ధంగా ఉంటుందని అన్నారు. అలాగే ప్రభుత్వ ఆదాయం కోసం రైతులు వద్ద నుండి పొలం పన్నులను కట్టించుకుంటుందన్నారు. ప్రజలకు ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు రాత్రింబవళ్లు ప్రజలకు సేవ చేస్తూ వారికి అన్ని విధాలుగా సహాయపడడం రెవెన్యూ శాఖకి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ సునీత, ఆర్ఐ రవి, రీ సర్వే డిటి మూర్తి, తొర్రిగడ్డ వైస్ ఛైర్మెన్ శ్రీమందపాటి జగపతిరాజు, చినకొండేపూడి కాలువ ప్రెసిడెంట్ కొనే శ్రీను, జనసేన మండల ఇంచార్జి మట్టా వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ మురళీ, వీఆర్వోలు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరమేశు బయోటెక్‌లో యోగా

విశాలాంధ్ర-దేవరపల్లి: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని దేవరపల్లి పరమేశు బయోటెక్ మొక్కజొన్న ఫ్యాక్టరీలో శుక్రవారం యోగ ప్రాక్టీస్ నిర్వహించారు. ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు వివిధ రకాల ఆసనాలు చేశారు. ఈ సందర్భంగా పరమేశు బయోటెక్ మొక్కజొన్న ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ శివప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని తమ ఫ్యాక్టరీ సిబ్బంది ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు వివిధ తమ ఫ్యాక్టరీ యాజమాన్యం సహకారంతో సిబ్బంది ఎంతో శ్రద్ధగా యోగా ప్రాక్టీస్ చేశారని తెలిపారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామన్నపాలెం హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు షాప్ డైరెక్టర్ పేరం రవీంద్ర ఫ్యాక్టరీ సిబ్బందితో యోగా ప్రాక్టీస్ నిర్వహించారు. ఈ సందర్భంగా పేరంరవీంద్ర మాట్లాడుతూ యోగా అనేది ఒక సాధన అని యోగాను కంగారుగా చేయకూడదని నెమ్మదిగా చేయాలన్నారు. ముఖ్యంగా యోగాలో అనేక భంగిమలు ఉంటాయని తెలిపారు. పరమేశు బయోటెక్ మొక్కజొన్న ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ శివప్రసాద్ మాట్లాడుతూ సిబ్బంది యోగ ప్రాక్టీస్ చేస్తున్నారన్నారు. అందరికీ టీ షర్ట్స్, యోగా సామాగ్రి అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ సిబ్బంది ఉద్యోగులు పాల్గొన్నారు.

యోగాంధ్ర విజయవంతం చేయండి

విశాలాంధ్ర - అనపర్తి, పెదపూడి : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని పెదపూడి ఎంపిడిఓ కార్యాలయంలో యోగాంధ్రకి సంబంధించి సమన్వయ సమావేశం నిర్వహించారు. శుక్రవారం ఎంపిడిఓ, డిప్యూటీ ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి, ఎం సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో యోగా కార్యక్రమం విజయవంతానికి పలు సూచనలు చేశారు. యోగా నిర్వహించే ప్రాంతానికి సర్పంచులు, ఎంపీటీసీలు, డ్వాక్రా సంఘాల మహిళలు, ఉపాధి కూలీలు, ప్రజలు, వివిధ సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు యోగా నిర్వహించే ప్రాంతం (తొమ్మిది చోట్ల)కు ఉదయం 6:30కి చేరుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉదయం 7 గంటలకు రాష్ట్రమంతటా యోగా కార్యక్రమం ప్రారంభ మవుతుందని డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉషారాణి, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, యోగా స్థల ఇంచార్జ్‌లు పాల్గొన్నారు.

ఆదిత్యలో ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలో 'ఏఐ టూల్స్ ఫర్ రీసెర్చ్ అండ్ ప్రాజెక్ట్ డెవలప్మెంట్ టెక్నిక్స్' అనే అంశంపై రెండు రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఉత్సాహంగా ప్రారంభమైంది అని ఆదిత్య విద్యాసంస్థల డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా ఎం శ్రీనివాసరెడ్డి తెలిపారు. మొదటిరోజున, బెంగుళూరు అలయన్స్ యూనివర్సిటీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ పి సెంతామరైకన్నన్, ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఉపాధ్యాయుల రీసెర్చ్ స్కిల్స్ పెంపొందించడంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యొక్క ప్రాముఖ్యతను విపులంగా వివరిస్తూ ఏఐ ఆధారిత ఉపకరణాలపై, హాండ్స్-ఆన్ శిక్షణ యిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా ఎంబి శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్స్ డా ఆదిరెడ్డి రమేష్, డా ఎస్ రమాశ్రీ, రిజిస్ట్రార్ డా జి సురేష్, కో- ఆర్డినేటర్ డా ఎ శరవణన్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

సీతాపతిరావుకి ఉత్తమ రెవెన్యూ సేవా పురస్కారం

విశాలాంధ్ర - పెదపూడి, అనపర్తి : పెదపూడి మండల తహశీల్దార్ సీతాపతి రావుకు జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఉత్తమ రెవెన్యూ సేవా పురస్కారం అందించారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్ కార్యాలయంలో ఉత్తమ సేవలందిస్తున్న సీతాపతి రావుకు రెవెన్యూ డే సందర్భంగా ఈ పురస్కారాన్ని కలెక్టర్ అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సీతాపతిరావు మాట్లాడుతూ ఈ అవార్డ రావడం చాలా ఆనందంగా ఉందని అంతేకాకుండా ప్రజలకు మరింత సేవలందించే బాధ్యత పెరిగిందని చెప్పారు.

శ్రీనివాసుని శోభాయాత్ర

విశాలాంధ్ర - ఆలమూరు : తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు అధికారి శ్రీ పగడాల ఆనంద తీర్థాచార్యుల నేతృత్వంలో జొన్నాడ శ్రీ వైట్ల చినవెంకన్న కల్యాణ మండపంలో జరుగుతున్న శ్రీ పురందరదాసుల సంకీర్తన శిక్షణ తరగతులు భక్తజన కోలాహలాన్ని తలపించాయి. మూడవ రోజైన శుక్రవారం జొన్నాడ శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మొదలైన శోభాయాత్ర ఆద్యంతం భక్తి తన్మయత్వాన్ని రేకెత్తించింది. పురందర ప్రశస్త అవార్డు గ్రహీత ఏ ఎం స్వామి, జొన్నాడలోని రెండు భజన మండళ్ళ సభ్యులతో పాటుగా వివిధ ప్రాంతాల నుంచి శిక్షణ తరగతులకు హాజరైన భజన మండలి సభ్యులు కోలాటం, భక్తి సంకీర్తనలు, గోవింద నామస్మరణ చేసుకుంటూ గ్రామమంతా ఊరేగారు. ఈ కార్యక్రమంలో గొలుగూరి ఈశ్వర్ రెడ్డి, తాడి శ్రీనివాసరెడ్డి (బట్టి శ్రీను), గొడవర్తి దుర్గాప్రసాద్ (బాబి), అయినవిల్లి సత్తిబాబు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఈఏపీసెట్ ర్యాంకర్‌కు అభినందన

విశాలాంధ్ర - ఆలమూరు : ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యను అభ్యసించి ఇటీవల విడుదలైన ఫలితాల్లో 914 మార్కులతో పాటు, ఏపీఈఏపీసెట్‌లో 11,776 ర్యాంకు సాధించిన వాకా అమృతకు గురువారం ప్రిన్సిపాల్ నల్లమిల్లి సురేష్‌రెడ్డి, ఆలమూరు ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ గుణ్ణం వీర్రాజు, జాయింట్ సెక్రటరీ గారపాటి త్రిమూర్తులు చేతుల మీదుగా ఘన సత్కరించారు. బహుమతులు అందించి అభినందించారు. ప్రభుత్వ కళాశాలలో విద్యాభ్యాసం చేసి కార్పొరేట్ కళాశాలలతో సమానంగా ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. చుట్టుప్రక్కల గ్రామాల తల్లిదం డ్రులు తమ పిల్లలను ఈ కళాశాలలో చేర్పి ఇక్కడ లభిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకోవాలని ప్రిన్సిపల్ సురేష్ రెడ్డి ఈ సందర్భంగా కోరారు.



అంతర్జాతీయ యోగా దినోత్సవం

విశాలాంధ్ర - కడియం : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా భారతీయ జనతా పార్టీ కడియం మండల అధ్యక్షులు బోరస ుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కడియం మినర్వా పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం యోగా శిక్షణ కార్యక్రమం జరిగింది. సుమారు 200 మంది విద్యార్థులు కూటమి నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు చేసి, యోగా యొక్క ప్రాధాన్యతను తెలుసు కున్నారు. యోగా గురువు, రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు కోడూరు లక్ష్మీనారాయణ చే యోగాభ్యాసనాలు చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమం అనంతరం యోగ గురువును మినర్వా పబ్లిక్ స్కూల్ యాజమాన్యం, మండల పెద్దలు సత్కరించారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 'యోగాంధ్ర' కార్యక్రమం స్థానిక సరయు ఫంక్షన్ హాల్లో ప్రత్తిపాడు సర్కిల్ పరిధిలో సబ్ ఇన్స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది యోగా దినోత్సవ నిర్వహించి యోగాసనాలు చేసారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు ఎస్సై ఎస్ లక్ష్మికాంతం, ఏలేశ్వరం, అన్నవరం ఎస్సైలు రామలింగేశ్వరరావు, శ్రీహరి బాబు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన, ఆనందకరమైన సమాజం కోసం యోగా చేయాలని పిలుపిచ్చారు. మన శరీరం, మనసును ఆధీనంలో ఉంచుకునేందుకు యోగా ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్రను చేపట్టిందన్నారు. 45 నిమిషాల ఆసనాలతో అనారోగ్యాలు దరి చేరకుండా చూడవచ్చునని, ఎటువంటి ఒత్తిడిని అయినా తట్టుకుని నిలబడేలా యోగా సహకరిస్తుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఐలేజు రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ న్యాయవాది బుగతా శివ పాల్గొన్నారు.

చలో విశాఖకు వైద్య సిబ్బంది

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : 21న జరిగే యోగాంధ్ర విశాఖపట్నం కార్యక్రమమునకు జిల్లా కలెక్టరు పి. ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా కె. వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి 2 బస్సులలో 72 మంది వైద్య సిబ్బందిని పంపడం జరిగిందని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా కె వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక డీ ఎమ్‌హెచ్‌వో కార్యాలయం వద్ద నుంచి శుక్రవారం ఉదయం విశాఖపట్నం బయలుదేరిన వాహనాలకు డా కోమలి జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. పి . కోమల, డీపీఎమ్వో డా . శ్రీవల్లి, ఇన్చార్జి డిప్యూటీ డి ఎమ్ హెచ్ వో డాక్టర్ కే సుధాకర్ తదితరులు జెండా పూపి ప్రారంభించారు. జిల్లా నుంచి 24 మంది వైద్యులు, 24 మంది స్టాఫ్ నర్సులు, 24 మంది ఫార్మసిస్టులు పాల్గని జిల్లా తరుపున మెడికల్ క్యాంపులు నిర్వహిస్తారని తెలియ చేశారు. అదేవిధంగా జిల్లా వైద్య శాఖ తరుపున AKC college, హ్యాపీ స్ట్రీట్ వద్ద జరిగే యోగాంధ్ర కార్య క్రమమునకు అందరు ఆరోగ్య సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని డి ఎమ్ హెచ్ వో డా కె వెంకటేశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో సత్య కుమార్ నల్లూరి, డిస్ట్రిక్ట్ ఎపిడమాలజిస్టు సుధీర్, సి హెచ్ వో శర్మ, ఎంపీ హెచ్ ఈ వో బాపి రాజు, మూర్తి, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు

ట్రాక్టర్‌కు నష్టపరిహారం చెల్లించాలి

విశాలాంధ్ర - కడియం : కడియం మండలం జేగురుపాడు గ్రామం జగనన్న కాలనీ ప్రజలకు మంచినీరు సరఫరా చేయడానికి, జేగురుపాడు పంచాయతీకి చెందిన ట్యాంకర్‌ను తీసుకు వెళుతున్న ట్రాక్టర్ సెప్టెంబర్ 9, 2023న ప్రమాద వశాత్తు తిరగబడి, ట్రాక్టర్ పాక్షికంగా దెబ్బతిన్నది. ట్రాక్టరుకు చోళమండలం ఎంఎస్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి తీసుకున్న ఇన్సూరెన్స్ పాలసి ఆక్సిడెంట్ సమయానికి అమలులోనే ఉంది. సదరు బీమా కంపెనీకి ఏక్సిడెంట్‌కు సంబంధించిన సమాచారం పంచాయతీ అధికారులు ఇచ్చినప్పటికీ, వివిధ కారణాలతో క్లెయిమ్ తిరస్కరించారు. అయితే గ్రామ సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్ అప్పటి గ్రామ కార్యదర్శి బి శిరీషా తో కలిసి జిల్లా వినియోగదారుల ఫోరంలో జూన్ 2, 2024న ఫిర్యాదు చేశారు. ఘటనలో ట్రాక్టర్ రిపేర్ నిమిత్తం అయ్యిన ఖర్చు రూ.81,788లు, అదేవిధంగా ఖర్చుల క్రింద రూ.20,000 45 రోజులు లోపు చెల్లించాలని, లేని పక్షంలో 12 శాతం వడ్డీతో సహ చెల్లించాలని తూర్పు గోదావరి జిల్లా వినియోగదారుల ఫోరం మెంబర్ ఆర్ శ్రీనివాసరాజు తీర్పు వెల్లడించినట్లు జేగురుపాడు పంచాయతీ కార్యదర్శి ఐ శ్రీనివాస్ తెలిపారు.

కూటమి నాయకుల జేబుల్లోకి ఇసుక డబ్బు : తలారి

విశాలాంధ్ర -తాళ్లపూడి : ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తామని చెప్పి ప్రజల్ని మోసం చేసిందని, అదనంగా వసూలు చేసిన డబ్బు కూటమి నాయ కుల జేబులలోకి వెళుతోందని, వారి జేబులు నింపటం కోసం గోదావరి నదిలో డ్రెజ్జింగ్ చేస్తున్నప్పటికి పట్టించ ుకోవటం లేదని కొవ్వూరు నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త తలారి వెంకట్రావు ఆరోపిం చారు. నియోజకవర్గంలో దాదాపుగా 25 డ్రెజ్జింగ్ పడవు లను పట్టుకున్నట్లు అధికారుల లెక్కలు చెబుతుండగా, పట్టు కున్న ఆబోట్లు నిషేధిత పడవు లైనందున వాటిని బయటకి పంపకుండా గోదావరి నది లోనే ఇంకా ఉంచటం ఏమిటని, పరోక్షంగా రీచ్ నిర్వాహకులకు టీడీపీ నాయ కులకు ప్రభుత్వం అక్రమ తవ్వకాలను ప్రోత్సహించటమే కదా అన్నారు. కూలి కొచ్చిన పడవుల యజమానులుపై డ్రెజ్జింగ్ కేసులు కట్టటమేమిటని, వాటిని వినియోగిం చటానికి తెప్పించిన రీచ్‌లు వాళ్లపై కేసులెందుకు కట్టడాం లేదని తలారి ప్రశ్నించారు. పార్టీ నాయకులతో కలిసి రీచ్‌ల్లో పర్యటించి, డ్రెజ్జింగ్ బోట్లను పరిశీలించారు. జగనన్న నమ్మకం చంద్రన్న బూటకంలి జగనన్న నమ్మకం, చంద్రన్న బూటకం అంటూ వైఎస్సార్సీపీ నాయకులు వినాధాలు మధ్య తాళ్లపూడి మండల వైసీపీ అధ్యక్షులు కొలిశెట్టి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి కొవ్వూరు వైస్సార్సీపీ నియోజకవర్గ ఇంచార్జి తలారి వెంకట్రావు జగనన్న నమ్మకం ఆనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు, తాళ్లపూడి మండలాల వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-దేవరపల్లి: జనసేనకుడికి ఆర్థిక సహాయం అందిస్తున్న జనసేన నాయకులు.. గత కొద్ది రోజుల క్రితం దేవరపల్లి గ్రామంలోని వాసంశెట్టి శివ నాగ దుర్గ ప్రసాద్ అనే జనసైనికుడు కుటుంబ శుభకార్యముకు వెళుతుండగా కొవ్వూరు హైవేపై బైక్ మీద వెళ్లుండగా కుక్క అడ్డుపడి పడిపోవడం వలన బలమైన దెబ్బలు తగిలాయి. మధ్యతరగతి కుటుంబం వలన హాస్పటల్ ఖర్చులకు అధిక ఇబ్బందులు పడుతున్నారన్న విషయం తెలుసుకున్న దేవరపల్లి జనసేన నాయకులు గోపాలపురం నియోజ కవర్గం కలిసి రూ.16000 వేలు వసూలుచేసి దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సువర్ణరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడైనా జనసైనికుడికి ఆపద వస్తే జనసేన పార్టీ సహాయం చేయడంలో ఎప్పుడూ ముందు ఉంటుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి గౌరవ అధ్యక్షులు పసుపులేటి ప్రసాద్, కంబాల సత్తిబాబు, కొడమంచిలి శ్రీను, దాసరి శేష, సూరిశెట్టి బాలు, దుగ్గిన గంగాధర్, పోలుమాటి నాని, తంగెళ్ల గంగాధర్,ఎం నాని తదితరులు పాల్గొన్నారు.

దేశభద్రత, సైబర్ నేరాలపై అవగాహన

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం. 11 జూన్ నుంచి 20 జూన్ వరకు ఆదిత్య యూనివర్సిటీలో జరిగిన సిఏటిసి-7 క్యాంపు విజయవంతంగా ముగిసిందని 9(ఏ)ఎయిర్ ఎస్క్వాడ్రన్ (టి) ఎన్‌సిసి కాకినాడ కమాండింగ్ ఆఫీసర్-గ్రూప్ కెప్టెన్ ప్రవీణ్ బాబు తెలిపారు. పది రోజుల పాటు నిర్వహించిన ఈ క్యాంపులో దేశ భద్రత, సైబర్ నేరాలపై అవగాహన, ఎన్‌డిఆర్ఎఫ్ బృందం ద్వారా ప్రకృతి విపత్తుల అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. పర్యావరణ అవగాహనకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పర్యావ రణాన్ని పరిరక్షించాలి అని తెలిపారు. ఈ క్యాంపులో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుండి వచ్చిన 450 మంది క్యాడెట్‌కి ఆదిత్య యూనివర్సిటీ అతిథ్యం ఇవ్వడం, ఎన్‌సిసి క్యాడెట్‌ని ప్రోత్సాహించడం ఎంతో గొప్ప విషయమని తెలిపారు. ఇంతటి చక్కటి అతిథ్యం ఇవ్వడం మరువలేనిదని ఎన్‌సిసి అధికారులు, వివిధ కళాశాల ఏఎన్ఒలు, పాఠశాల ఎన్‌ఓలు ఆనందం వ్యక్తం చేశారు. ఇంతటి ప్రోత్సాహం అందిస్తున్న ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సిలర్ డా ఎం శ్రీనివాస రెడ్డికి 9(ఏ)ఎయిర్ ఎస్క్వాడ్రన్ (టి) ఎన్‌సిసి సిఓ-గ్రూప్ కెప్టెన్ ప్రవీణ్ బాబు కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేసి అభినందనలు తెలియజేశారు.

23న జాబ్‌మేళా

విశాలాంధ్ర - కాకినాడ : "వికాస" ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీ సోమవారం 'వికాస' కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడలో 'జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ఈ జాబ్‌మేళాలో కీర్తి మెడికల్స్ స్టోర్స్ ప్రై.లి.లో సీనియర్, జూనియర్ ఫార్మాసిస్ట్, సర్టికల్ ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్ మేనేజర్, ముత్తూట్ గ్రూప్ కంపెనీలో ఇంటర్న్, పిఒ, ఎఫ్ఒ, ఐసాన్ ఎక్స్పీరియన్సెస్ కంపెనీలో టెలి సేల్స్ రిప్రజెంటేటివ్, ఇసుజు మోటార్స్ ప్రై.లి, హోండాయ్ మోబిస్ కంపెనీల్లో టెక్నిషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, డిప్లొమో, బి ఫార్మసీ, డి ఫార్మసీ, ఎం ఫార్మసీ, బి టెక్, ఎం బిఎ అండ్ ఎంకామ్ ఉత్తీర్ణులైన 35 సం.లోపు అభ్యర్థులు అర్హులు. వీరికి నెలకు రూ.12,000 నుంచి రూ.23,000 వరకు జీతం , ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుంది. అలాగే డిడియుజికెవై స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా టు వీలర్ టెక్నిషియన్, లాజిస్టిక్స్‌లో ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నారు. ట్రైనింగ్ సమయంలో ఉచిత భోజనం, వసతిసౌకర్యం ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులందరూ ఈ నెల 23 సోమవారం 'వికాస కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడ' వద్ద ఉదయం 9 గం.లకు సర్టిఫికెట్స్ జెరాక్సో హాజరుకావలెను. మరిన్ని వివరాలకు 7799376222 www.vikasajobs.com సంప్రదించవలెను.

జాయింట్ పట్టాదారుల భూముల విభజనకు వెసులుబాటు

విశాలాంధ్ర - ఆలమూరు : భూముల రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో వెబ్ ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదైనవారి భూముల విభజన చేయడానికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని శుక్రవారం తహసీల్దార్ కెజే ప్రకాష్ బాబు, మండల సర్వేయర్ ప్రభావతి తెలిపారు. రీ సర్వే పూర్తయిన వెబ్ ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారు లుగా నమోదైన భూ యజమానులు భూ విభజన నిమిత్తం ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గతంలో రూ.500లుగా నిర్దేశించిన రుసుమును మినహా యించినట్లు తెలిపారు. నామ మాత్రపు రుసుము రూ.50లను గ్రామ సచివాలయంలో చెల్లించి, ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని వారు సూచించారు. రుసుము మినహాయింపు ఈ నెలాఖరు వరకు మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. దీన్ని సద్వినియోగం చేసుకుని జాయింట్ పట్టాలను విడివిడిగా విభజన చేయించు కోవాలని కోరారు. దీని వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలైన అన్న దాత సుఖీభవ, తల్లికి వందనం వంటివి పొందవచ్చున్నారు.

బాధిత రైతులకు న్యాయం చేయటానికి కృషి : ఎంపీ

విశాలాంధ్ర - అమలాపురం : అయినవిల్లి మండలం శానిపల్లంక వద్ద కోనసీమ రైల్వే లైన్‌కు జరిగిన పనులను అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ బాలయోగి స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. రైల్వే లైన్‌లో భూములు ఉన్న రైతులతో సమావేశమయ్యారు. బాధిత రైతులకు న్యాయం చేసి రైల్వే లైన్ పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. రైల్వే లైన్ కోసం కోనసీమలో ఉన్న నదులలో దాదాపుగా పిల్లర్స్ పనులు పూర్తయ్యే దశలో ఉన్నాయని తెలిపారు. వీటిపై నిర్మించే సూపర్ స్ట్రక్చర్ నిర్మాణానికి రైల్వే శాఖ టెండర్ పిలిచిందని కాంట్రాక్టు అవార్డు కూడా ఖరారు అయ్యిందని చెప్పారు. ఈ పనులు చేసేందుకు ఉన్న అడ్డంకులు తొలగించేందుకు దృష్టి సారించామని హరీష్ వివరించారు. భూ సేకరణకు ఉన్న అడ్డంకులను ప్రక్రియ పూర్తి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం అమలాపురంలోని ఎంపీ నివాసం వద్ద సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులతో హరీష్ సమావేశం నిర్వహించారు. రైల్వే పనులు పూర్తి చేయడానికి రెవెన్యూ అధికారుల పూర్తి సహకారం చేస్తారని అలాగే నా వైపు నుంచి పూర్తి సహకారం ఉంటుందని రైల్వే శాఖ అధికారులకు ఎంపీ హరీష్ బాలయోగి వివరించారు. ఈ సమావేశంలో సౌత్ సెంట్రల్ రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ ఎ బద్దయ్య, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి అర్జున్ రావు, తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో బంగారు వ్యాపారి ఆత్మహత్య..?

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం జువెలరీ షాపు యజమాని నారాయణ అప్పారావు గోదావరిలోకి దూకి ఆత్మహత్య చేసుకు న్నారు. స్థానిక సాలిపేట పాలబుచ్చయ్య వీధిలో అప్పారావు బంగారం షాపు నిర్వహించేవాడు. రాజమండ్రి గోదావరి గట్టున మోటార్ సైకిల్ పార్కింగ్ చేసి గోదావరిలోకి దూకినట్లు గుర్తించారు. మృతదేహాన్ని గురువారం గోదారి గట్టున కనుగొన్నారు.. శుక్రవారం రాజ మండ్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అప్పుల బాధతో ఏడాది కిందట గూడెంలో షాపు క్లోజ్ చేసి హైదరాబాదులో స్థిరపడ్డాడు. అక్కడ ఒక దుకాణంలో పని చేస్తూ కాలం గడిపేవాడు. బంధువుల ఒత్తిడితో తిరిగి తాడేపల్లిగూడెం వచ్చాడు. సోమవారం ఉదయం నుంచి కనిపించడం లేదు. బుధవారం గోదాట్లోకి దూకినట్లు సమాచారం. ఈయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడికి వివాహం అయ్యింది. కుమార్తెకు పెళ్లి కావలసి ఉంది. ఈయన సోదరుడు సమీపంలోని బంగారు దుకాణం నిర్వహిస్తు న్నారు. అప్పుల బాధతో అప్పారావు ఆత్మహత్య చేసుకు న్నాడు. బంగారు వ్యాపారి మృతి చెందడంతో బంగారం షాపుల వర్తకులు శుక్రవారం సంతాపం తెలియజేస్తూ స్వచ్ఛందంగా షాపులు మూసివేసి శ్రద్ధాంజలి ఘటించారు. మృతదేహాన్ని రాజమండ్రి నుంచి తీసుకురావలసి ఉంది.

ఐఐఎఫ్‌టి క్యాంపస్ నిర్మాణ పనులు పరిశీలన

విశాలాంధ్ర - కాకినాడ : యు కొత్తపల్లి మండలం, పొన్నాడ వద్ద 25 ఎకరాల విస్తీర్ణంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ప్రతిష్ఠాత్మక ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టి) క్యాంపస్ నిర్మాణ పనులను శుక్రవారం కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పరిశీలించారు. ముందుగా ఆయన సంబంధిత అధికారులు, గుత్తేదారుతో కలిసి క్యాంపస్‌లో నిర్మాణంలో ఉన్న తరగతి గదులు, హాస్టల్ భవనాలు, ల్యాబ్‌తో పాటు ఇతర విభాగాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన అధికారులతో సమావేశమై పనుల పురోగతిపై చర్చించి నాణ్యతలో రాజీ లేకుండా పనులు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ.229.81 కోట్ల వ్యయంతో మూడేళ్ల క్రితం క్యాంపస్ నిర్మాణానికి శ్రీకారం చుట్టగా గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు ఇవ్వకుండా తాత్సారం చేసి నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కేవలం 20 శాతం పనులు మాత్రమే జరిగాయన్నారు. ఈ దశలో కూటమి ప్రభుత్వం అధికారులకు వచ్చిన తర్వాత తాను వ్యక్తిగతంగా దీనిపై దృష్టి సారించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించడంతో ఏడాదిలోనే 80 శాతం పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న కేంద్ర ప్రభుత్వ వాటా నిధుల కోసం పలుమార్లు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్, సంబంధిత శాఖ అధికారులను కలిసి ఒత్తిడి చేయగా కేంద్రం ఇటీవల రూ.25 కోట్లు విడుదల చేసిందన్నారు. నిధులు అందుబాటులో ఉన్నందున పనుల్లో వేగం పెంచి క్యాంపస్ ను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాల పెండింగ్ నిధుల కోసం తనవంతు ప్రయత్నం చేస్తానని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. క్యాంపస్ నిర్మాణానికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర వాణిజ్య,పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌లకు ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

పదిగంటల పనిదినాన్ని రద్దు చేయాలని ధర్నా

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: ప్రపంచవ్యాప్తంగా పనిగంటలు తగ్గిస్తున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్‌లో పదిగంటల పనిదినాన్ని ప్రవేశపెట్టాలని చూడటం దారుణమని, మారిన వాతావరణ, ఆహార అలవాట్ల, ఆరోగ్య పరిస్థితుల్లో రాష్ట్రంలో ఆరుగంటల పనిదినాన్ని ప్రవేశపెట్టాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. సోమసుందర్ డిమాండ్ చేశారు. పదిగంటల పనిదినాన్ని ప్రవేశ పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడానికి నిరసనగా ఏఐటీయూసీ ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాల కార్మికులు ధర్నా నిర్వహించారు. మునిసిపల్, ఏరియా ఆస్పత్రి , సి.డబ్ల్యు.సి., ఎస్.డబ్ల్యు.సి గోడౌన్ జట్ల కార్మికులు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పది గంటల పనిదినాన్ని రద్దు చేయాలని, ఆరుగంటల పనిదినాన్ని ప్రవేశపెట్టాలని, పనిభారం తగ్గించాలని, సిబ్బంది సంఖ్యను పెంచాలని, సమానపనికి సమానవేతనం ఇవ్వాలని, కనీసవేతనం రూ.35 వేలు ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని కార్మికులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డి.సోమసుందర్ మాట్లాడుతూ వికసిత్ భారత్ ,స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్యాల సాధనలో కార్మికుల ఆరోగ్యం చాలా ముఖ్యమైనదన్నారు. పనిగంటలు పెంచడం ద్వారా కార్మికులపై పనిభారం పెంచడం వారి ఆరోగ్యాన్ని, పని సామర్థ్యాన్ని దెబ్బ తీస్తుందని సోమసుందర్ అన్నారు. కాయకష్టం చేసే కార్మికులే నిజమైన యోగ సాధకులని, వారు రోజువారీ జీవితంలోనే తమ శ్రమ ద్వారా కర్మ యోగా అనుసరిస్తున్నారని , వారి ఆరోగ్యాన్ని దెబ్బ తీసే చర్యలకు పూనుకోవడం తగదని అన్నారు. శ్రామికుల ఆరోగ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని సోమసుందర్ స్పష్టం చేశారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు, జట్టు కార్మికులు దుమ్ము ధూళిలో పనిచేస్తారని, కాలుష్యం కారణంగా వారి ఆరోగ్యం పాడై పోతుందని, మోకాళ్ళు అరిగిపోతాయని ,అలాంటి పరిస్థితుల్లో వారిపై పనిభారం పెంచడం అన్యాయమని, పదిగంటల పనిదినాన్ని రద్దు చేయాలని కోరారు. ఏఐటీయూసీ ఏరియా కమిటీ కార్యదర్శి మందలపర్తి హరీష్ మాట్లాడుతూ జపాన్ లాంటి దేశాల్లో నాలుగు గంటల పనిదినం ప్రవేశపెట్టే ఆలోచన చేస్తుంటే ఆంధ్రప్రదేశ్‌లో పది గంటల పనిదినం ప్రవేశపెట్టే ఆలోచన చేయడం దుర్మార్గమన్నారు. సంపద సృష్టిలో పాలుపంచుకునే కార్మికుల ఆరోగ్యాన్ని కార్పొరేట్ లాభాల కోసం బలిచేయడం అన్యాయమని అన్నారు. ఏరియా కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ నూట ముప్పై ఏళ్ల క్రితం ఎనిమిది గంటల పనిదినం కోసం కార్మికవర్గం ప్రపంచ వ్యాప్తంగా పోరాడి సాధించుకున్న హక్కును ఇప్పుడు మార్చాలని చూడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. పనిగంటల పెంపుదలను కారికవర్గం వ్యతిరేకిస్తోందని అన్నారు. ఏరియా కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కే.లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ కనీస వేతనాలు అమలు చేయకుండా, జీతాలు సకాలంలో చెల్లించకుండా, పి.ఎఫ్. బకాయిలు పెట్టే ప్రభుత్వానికి పని గంటలు పెంచే హక్కు లేదన్నారు. కార్యక్రమానికి ఏఐటీయూసీ నాయకులు అల్లం కుమారస్వామి , కొడమంచిలి చంద్రరావు, మార్లపూడి కాటమరాజు, ఉప్పాటి నాగరాజు, తాడికొండ కనక మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్'పై సమీక్ష

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు ప్రకారం జిల్లాలో ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమం సక్రమంగా నిర్వహించేందుకు ప్రణాళిక ప్రకారం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమం అమలుపై శుక్రవారం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్ని మండలాల ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. స్వచ్ఛ కాకినాడ జిల్లా రూపొందించడంలో తీసుకోవాల్సిన చర్యలను జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. పరిశుభ్రమైన వాతావరణం ద్వారా ప్రజారోగ్య పరిరక్షణ, పర్యావరణంపై కాలుష్య ప్రభావాన్ని తగ్గించడం, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడం, భవిష్యత్ తరాల వారికి పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన కల్పించడం అనే లక్ష్యాలతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నెలకు ఒక అంశాన్ని ఎంచుకుని ఈ స్వచ్ఛ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపడుతుందన్నారు. 'నీరు మీరు' అనే ప్రత్యేక అంశంతో ఈ జూన్ నెల స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి కుంటలు శుభ్రం చేయడం, చెరువులను శుభ్రపరచడం, చెత్త కుప్పలు తొలగింపు, మురికి కాలువలు ప్రక్షాళన, ప్రజా మరుగుదొడ్లు శుభ్రం చేయడం, ప్రధాన రహదారుల, కూడలి ప్రదేశాల్లోని శుభ్రం చేయడం ఇతర పారిశుధ్య కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, ర్యాలీలు, ప్రతిజ్ఞలు చేయించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని ఆయన తెలిపారు. ఈ స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమం ద్వారా స్వచ్ఛత ప్రాధాన్యతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలను భాగస్వామ్యులను చేయాలని ఆయన తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకటరావు, డీఈఓ రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేయండి

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : వ్యవసాయానికి ఉపాధి హామీ పథకం అనుసంధానం చేయాలని, అలాగే కూలీలకు వేతనం పెంచాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రాజు అన్నారు. ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బంగార్రాజు మాట్లాడుతూ జులై 9న జరుగుతున్న సమ్మెకు వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం, కిసాన్ మహాసభ పూర్తిస్థాయి మద్దతును తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రేచుకట్ల సింహాచలం, తాడి నాగేశ్వరరావు, రాజాల రత్నం మాస రాజమణి శెట్టి ఏసు బాబు, బీర దేవతయ్య, అనసూరి లక్ష్మి, చిన్నం అర్జునుడు, కాదా నాగేశ్వరరావు, తాడి లక్ష్మణరావు, లోడ చిన్న మరియమ్మ పాల్గొన్నారు.